

లక్ష్మీపురంలో రథంలో కొలువైన పూరీక్షేత్రం నుంచి తెచ్చిన జగన్నాథ, సుభద్ర, బలభద్రుల దారు విగ్రహాలు

కదిలిన జగన్నాథ రథచక్రాలు

లక్ష్మీపురం ఆలయంలో రథోత్సవాలు ప్రారంభం - 5లో



కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట వద్ద నిల్వ ఉన్న ఇసుక

నేటి నుంచే.. ఉచిత ఇసుక!

వింజరం, ఇబ్రహీంపేట, చేబ్రోలులో ఇసుక స్టాక్ పాయింట్లు

- ఒక్కొక్కరికి 20 టన్నులకు లోబడే అందజేత
- నామమాత్రపు ధరకే సరఫరా
- సీసీ కెమెరాల ఏర్పాటు, అధికారుల పర్యవేక్షణ
- స్టాక్ పాయింట్లను పరిశీలించిన కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ లావణ్యవేణి

నాడు..

ఒకరోజు కాదు రెండు రోజులు కాదు ఏకంగా ఐదేళ్ల పాటు ఏరోజు కారోజే ఇసుక కోసం యుద్ధం. ఒకవైపు దళారులు, ఇంకోవైపు వైసీపీ నేతలు పేరుకి పక్కాగా ఇసుక పంపిణీ చేస్తామంటూనే ప్రకటనలు గుప్పించి, ధరలు ప్రకటించి ఇష్టానుసార వ్యవహారం. చిన్నపాటి ఇల్లు కట్టుకుందామన్నా ఇసుక లేదు. భారీ పరిశ్రమకు అవసరమైన నిల్వలు లేవు. ఎక్కడికక్కడ రాష్ట్రహద్దులు దాటి పొరుగు రాష్ట్రాలకు కోట్లాది రూపాయల ఇసుక రవాణా. వీటిలో అప్పటి ఎమ్మెల్యేలు, మంత్రులకు వాటాలు.. కీలక పాత్ర.. దొరికినంత మేర అడ్డంగా ఇసుక దోపిడీ.

నేడు..

రాష్ట్రంలో కూటమి పాలన ఆరంభం. ప్రజలు మెచ్చిన ప్రజా ప్రభుత్వం పక్కాగా నిర్ణయాలు.దానిలో భాగంగానే గడిచిన ఐదేళ్ల జనం పడ్డ పాట్లు స్థానంలో ఉచిత ఇసుక విధానం. అదికూడా రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచే అమలు. ఇప్పటికే నిల్వఉన్న ఇసుకను వినియోగదారులకు అందించబోతున్నారు. ఒక్కో ఆధార్ కార్డు మీద ఒక వ్యక్తికి రోజుకి 20 టన్నుల ఇసుకను ఉచితంగా అందించేందుకు ఏర్పాట్లు జరిగాయి. కేవలం నామమాత్రపు ఛార్జీలు మాత్రమే వసూలు చేస్తారు. అది కూడా జీఎస్టీ, ఇసుక ఎత్తిపోయడానికి ఆయిన ఛార్జీలతో పాటు ఇసుక పన్నును వసూలు చేస్తారు. ఇక రవాణా ఛార్జీలను వినియోగదారులే భరించాలి. గోదావరి ఇసుకను అందించేందుకు వీలుగా కుక్కునూరు మండలం వింజరం, ఇబ్రహీంపేట, ఉంగుటూరు మండలం చేబ్రోలు వద్ద ఇసుక స్టాక్ పాయింట్ల నుంచే ఉచిత ఇసుకను ఇప్పుడు ప్రథమ దశలో అందరికి అందిస్తారు.

(ఏలూరు,ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

జిల్లా వ్యాప్తంగా ఉచిత ఇసుక విధానం. నేటి నుంచి అమలు కాబోతోంది. తగ్గట్లుగా రాష్ట్రప్రభుత్వం ఎక్కడికక్కడ అధికారులకు మార్గనిర్దేశం చేసింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మాదిరిగానే కేవలం నామమాత్రపు ఛార్జీలు మాత్రమే వినియోగదారుల నుంచి వసూలు చేస్తారు. దీనికి మించి ఎక్కడా ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఇంతకు ముందు గోదావరి ఒడ్డున గూటాల గ్రామ సమీపాన ఇసుక రీచ్ ఉండేది. అది ఒక్కటే ఈ జిల్లాలో అతి పెద్ద రీచ్. కాని ఇప్పుడు ఉచిత ఇసుక విధానం ఆరంభం కానుండడంతో ఎక్కడైతే ఇసుక స్టాక్ ఉంటుందో అక్కడి నుంచే పని మొదలు పెట్టాలని అధికారులకు ఆదేశాలు అందాయి. కుక్కునూరు మండలం వింజరంలోని ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ప్రతి మెట్రిక్ టన్నుకు రూ.362, ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ వద్ద మెట్రిక్ టన్నుకు రూ.210, ఉంగుటూరు మండలం చేబ్రోలులో ఉన్న ఇసుక పాయింట్ వద్ద మెట్రిక్ టన్ను ఒక్కింటికి రూ.578 వసూలు చేయాలని నిర్ణయించారు. ఇంతకు ముందు అయితే టన్ను ఇసుక కావాలంటే అత్యధికంగా వేలల్లో రేట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి వచ్చేది. ప్రయాణ ఛార్జీలతో కలిపి మరి ముక్కుపిండి వినియోగదారుల నుంచి వసూలు చేసేవారు. ఈ సారి కూటమి ప్రభుత్వంలో దీనికి భిన్నమైన నేపథ్యంలో ఇసుకను వినియోగదారుల చెంతకే చేర్చబోతున్నారు. ఎక్కడికక్కడ ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద వినియోగదారుల నుంచి ఎంతెంత వసూలు చేయబోతున్నారో ప్రభుత్వం నిర్దేశించిన ధరలను పట్టిక రూపంలో ప్రదర్శించాల్సిందే. దీనికి లోబడి మాత్రమే ఇసుకను సరఫరా చేయాలి. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ వంటి అధికారుల పర్యవేక్షణ నిత్యం ఉండేలా నిర్ణయం తీసుకున్నారు. అన్ని రీచ్‌లవద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఉదయం 6 నుంచి రాత్రి 6 గంటల వరకు జరిగే లావాదేవీలను నిర్దేశిస్తారు, నిఘా పెడతారు. అలాగే ఇసుక అక్రమ మార్గాల్లో తరలకుండా ఎక్కడికక్కడ పోలీస్, రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. ఎవరైతే వినియోగదారులు తమకు ఇసుక కావాలని, ముందుకొస్తారో వారంతా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ఎవరైతే ముందు చేశారో, ఆ క్రమపద్ధతిలోనే స్టాక్ పాయింట్లో ఉన్న ఇసుకను అందించే ప్రయత్నం చేస్తారు. అంటే ముందుగా వస్తే ముందు వరుసలోనే అనే సూత్రాన్ని పాటిస్తారు.

నేడు అంకురార్పణ

ఉచిత ఇసుక విధానాన్ని సోమవారం నుంచే అమల్లోకి తేబోతున్నారు. కుక్కునూరులో ఇసుక స్టాక్ పాయింట్ల నుంచి లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని నాంది పలకబోతున్నారు. ఈ మేరకు సంబంధిత ప్రజా ప్రతినిధులతో పాటు కలెక్టర్ వెట్రి సెల్వి హాజరు కానున్నారు. ఇప్పటికే కుక్కునూరు, వేలేరుపాడులో జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి పర్యటించి, అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఉంగుటూరు మండలం చేబ్రోలు స్టాక్ పాయింట్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఇంతకు ముందే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరజ్‌కుమార్ ప్రసాద్, జిల్లా కలెక్టర్‌కు మార్గనిర్దేశం చేశారు. ఉచిత ఇసుక విధానం అమలుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఆరా తీసింది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిందిగా సూచనలు జారీ అయ్యాయి. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ఈ విధానాన్ని ప్రజలకు నేరుగా చేరేలా చూడాల్సిందిగా కూటమి నాయకత్వం ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది.

ప్రస్తుతం నిల్వ ఉన్న ఇసుకనే అందిస్తాం : జేసీ



కుక్కునూరు : ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఇసుక పాలసీ నేటి నుంచి అమలులోకి రానున్న నేపథ్యంలో మండలంలోని వింజరం ఇసుక డిపోను ఆదివారం జేసీ లావణ్యవేణి పరిశీలించారు. ఇప్పటి వరకు ఏజన్సీల ద్వారా ప్రజలకు ఇసుక సరఫరా జరిగిందని ఇక నుంచి కొత్త విధి విధానాలతో ఇసుక సరఫరా అవుతుందన్నారు. కుక్కునూరు మండలంలోని దాచారం, వింజరం, ఇబ్రహీంపేట, వేలేరుపాడు మండలంలోని రుద్రంకోట-1, రుద్రంకోట -2 ఇసుక రీచ్‌లు ఉన్నాయన్నారు. మైనింగ్ శాఖ వింజరం డిపోలో 4వేల మెట్రిక్ టన్నుల ఇసుక, ఇబ్రహీంపేటలో డిపోలో 95 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్టు నివేదిక ఇచ్చినట్టు తెలిపారు. అయితే ఇసుక డిపోల్లో అసలు ఎంత నిల్వలు ఉన్నాయో క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఇసుకను ప్రాథమికంగా అంచనా వేయాలని రెవెన్యూ శాఖను ఆదేశించినట్టు తెలిపారు. ప్రస్తుతం డిపోలలో ఉన్న ఇసుకను మాత్రమే ప్రజలకు అందిస్తామన్నారు. ఇదిలా ఉండగా వింజరం డిపోలో 4 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉన్నట్టు నివేదిక ఇవ్వగా క్షేత్రస్థాయిలో 1500 మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఆర్డీవో అద్దయ్య, తహసీల్దార్ అచ్యుతకుమారి పాల్గొన్నారు.



చేబ్రోలులోని ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే ధర్మరాజు

పారదర్శకంగా ఉచిత ఇసుక : కలెక్టర్

ఉంగుటూరు : రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి ఉచిత ఇసుక పంపిణీకి శ్రీకారం చుట్టిందని ఈ విషయంలో నాణ్యతతో కూడి పారదర్శకంగా పంపిణీ జరగాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వి పేర్కొన్నారు. ఆదివారం చేబ్రోలు ఇసుక స్టాక్ పాయింట్‌ను ఎమ్మెల్యే ధర్మరాజుతో కలసి సందర్శించి నాణ్యతను గనుల శాఖ అధికారుల సమక్షంలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇసుక నాణ్యతను పరిశీలించి నివేదిక సమర్పించాలని కోరారు. ఇసుక స్టాక్ కోసం కుక్కునూరు మండలంలోని రీచ్ నుంచి లేదా సమీపంలోని తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు రీచ్ నుంచి ఇసుకను రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టాక్ పాయింట్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఇనుప కంచె వేయించాలని, రవాణా వాహనాల రాకపోకలకు ముఖద్వారం నిర్మించాలన్నారు. ఇసుక ఛార్జీలు ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుక నాణ్యతను పరిశీలించి గనుల శాఖ సర్వేయర్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. ఆమె వెంట గనుల శాఖ ఏడీ జి.సునీల్ బాబు, ఏలూరు ఆర్డీవో ఖాజావలి, తహసీల్దార్ కె.వెంకట శివయ్య,సిబ్బంది పాల్గొన్నారు.



కైకరం ఆయకట్టులో నీట మునిగిన వరినాట్లు

విస్తారంగా వర్షాలు

ఏలూరు సిటీ, జూలై 7: జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఈదురు గాలులు బలంగా వీయడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయాలు ఏర్పడ్డాయి. ద్వారకా తిరుమలలో చెట్టు నేలకూలి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈసారి ఏర్పడిన విభిన్న వాతావరణంతో రాత్రి సమయాల్లోనే భారీగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో ఆదివారం తెల్లవారు ఝాము నుంచి పలు ప్రాంతాల్లో భారీగానే వర్షాలు కురిశాయి. జిల్లాలో గడచిన 24 గంటల్లో భీమడోలు మండలంలో అత్యధికంగా 78.2 మిల్లీ మీటర్లు నమోదవ్వగా జిల్లాలో సరాసరి వర్షపాతం 23.7 మి.మీగా నమోదైంది. కొయ్యలగూడెంలో 66.4, పెదవేగి 62.4, దెందులూరు 46.2, ఉంగుటూరు 40.2, ఏలూరు అర్బన్ 40, పోలవరం 38, కామవరపుకోట 37.4, ఏలూరు రూరల్ 32.2, నిడమర్రు 29.4, జంగారెడ్డిగూడెం 26.4, ద్వారకాతిరుమల 24, చింతలపూడి 20.2, పెదపాడు 16.4, టి.నరసాపురం 15.4, లింగపాలెం 12.6, నూజివీడు 12.4, ముసునూరు 10, వేలేరుపాడు 9, బుట్టాయిగూడెం 8.6, జీలుగుమిల్లి 7.4, కైకలూరు 6.8, చాట్రాయి 6.2, మండవల్లి 5.6, ఆగిరిపల్లి 5.2, కలిదిండి 4.4, కుక్కునూరు 3, ముదినేపల్లి 0.4 మి.మీ నమోదైంది.

నీట మునిగిన వరి నాట్లు


ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో శనివారం అర్ధరాత్రి భారీ వర్షం కురియడంతో నాట్లు వేసిన వరి చేలు నీట ముంపునకు గురయ్యాయి. మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

పట్టిసీమ నుంచి 6,018 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం జూలై 7 : ఏలూరు జిల్లాలోని పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6,018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వకు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు ఆదివారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 14.774 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 17 పంపులు, 12 మోటార్లతో నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. కృష్ణా డెల్టాలో నీటి అవసరత దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపుల సంఖ్య పెంచి నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు.

నిలకడగా గోదావరి నీటిమట్టం

పోలవరంలో గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి నిలకడగా మారింది. గత నాలుగు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు పోలవరం ప్రాజెక్టు ఎగువన కొండవాగులు, గోదావరి ఉపనదుల జలాలు గోదావరిలో కలుస్తుండడంతో గోదావరి నీటిమట్టం పెరిగింది. స్పిల్‌వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం వల్ల స్పిల్‌వేలో సాధారణ నీటిమట్టం మాత్రమే నమోదయ్యింది. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 26.550 మీటర్లు, దిగువన 16.580 మీటర్లు నమోదైనట్టు ఈఈలు పి.వెంకట రమణ, మల్లిఖార్జునరావు తెలిపారు.



పట్టిసీమ ఎత్తిపోతల నుంచి విడుదలవుతున్న గోదావరి జలాలు

అడుగుకో గొయ్యి..

- చింతలపూడి నగర పంచాయతీలో రోడ్లు అధ్వానం
- ఇటీవల ఎమ్మెల్యే పరిశీలన.. మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు
- అయినా చర్యలు తీసుకోని అధికారులు



రత్నా సెంటర్లో అధ్వానంగా ఆర్అండ్‌బీ రోడ్డు

చింతలపూడి, జూలై 7 : చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని ఏలూరు రోడ్డు ప్రధాన రహదారిపై పడిన గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు రోడ్ల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో పట్టణంలోని ప్రధాన అంతర్గత రోడ్లన్నీ గోతులతో దారుణంగా మారాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఈ గోతులను కనీసం రాళ్లతోనైనా గోతులు పూడ్చండి మహాప్రభో అంటూ పట్టణవాసులు కోరుతున్నారు. నగర పంచాయతీలోని ప్రధానంగా సాయిబాబా గుడి సెంటర్, మినీ బస్టాండ్, బోసుబొమ్మ సెంటర్, ఏరియా ఆస్పత్రి, ఫైర్‌స్టేషన్ సెంటర్, కొత్త బస్టాండు ఏరియా, గురుపట్లగూడెం, సమ్మెటవారిగూడెం ఏరియాలోని రోడ్లు భారీ గోతులు పడి ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ గోతుల్లో అధికారులు కనీసం చారెడుమట్టి కూడా పోయలేదు. ఇటీవల వర్షాలకు ఈ గోతుల్లో నీరుచేరి అది ఎంత గొయ్యి ఉందో తెలియక వాహనదారులు అందులోపడి ప్రమాదాలకు గురి అవుతున్నారు. రత్నా సెంటర్లో పెద్దవాహనాల డ్రైవర్లు సైతం బిక్కుబిక్కుమంటూ నడుపుతున్నారు. ఈ మార్గంలో నిత్యం పామాయిల్ లోడులారీలు, గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డుకు తరలించే మట్టి వాహనాలు, ఆర్టీసీ బస్సులు అధికసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ దారి పొడవునా వందలాది ద్విచక్ర వాహనాలు, కార్లు తిరుగుతుం టాయి. వాహనదారులంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నడపాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. గతంలో రత్నా సెంటర్లో సిమెంట్‌రోడ్డు వేసినా అదికూడా గోతులమయంగా మారింది. ఇక్కడ ఇంతనీరు నిల్వ ఉండ దానికి కారణాలు ఏమిటని కనీసం అధికారులు పరిశీలించడం లేదు. ఫైర్‌స్టేషన్ సెంటర్లో ఆక్రమణల జోరు, గోతులమయంతో ఎమ్మెల్యే ఇంటికి వెళ్ళే దారి కూడా అధ్వానంగా ఉంది. ఇక ఏరియా ఆస్పత్రి వద్ద పెద్ద గొయ్యి పడింది.



మినీ బస్టాండ్ వద్ద..

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్

ఇటీవల ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ఆర్అండ్‌బీ, మునిసిపల్ అధికారులను పిలిచి సమీక్షించారు. కనీసం గోతుల్లో రాళ్ళువేసి పూడ్చమని ఆదేశించారు. చెప్పి వారం రోజులు గడుస్తున్నా ఒక్క గొయ్యిలో కూడా రాళ్లు పోసిన దాఖలాలు లేవు. అధికారులు సమన్వయంతో ప్రజలకు సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అయితే ఆయన ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ఇప్పటి వరకు గోతుల్లో కనీసం రాళ్ళు పోయ లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఏరియా ఆసుపత్రి వద్ద గొయ్యి



ఫైర్‌స్టేషన్ సెంటర్లో గోతులమయం



రామనర్సాపురం గ్రామం

ఊరంతా.. కిడ్నీ బాధితులే!

రామనర్సాపురాన్ని వేధిస్తున్న కిడ్నీ సమస్య

గ్రామ జనాభా 250..
బాధితులు 30 మందికి పైగా..

- మెరుగైన వైద్యం అందని కొండరెడ్లు
- ఇటీవల కలెక్టర్ పర్యటనతో బహిర్గతం
- చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు ఆదేశాలు



కిడ్నీలో రాళ్ళతో బాధపడుతున్న కొండరెడ్లు

బుట్టాయగూడెం, జూలై 7 : బుట్టాయగూడెం-పోలవరం మండలాల సరిహద్దు ప్రాంతంలో అటవీ ప్రాంతంలో ఉన్న రామనర్సాపురం కొండరెడ్డి గ్రామం కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. ఒకరు, ఇద్దరు కాదు గ్రామంలో అధిక సంఖ్యలో కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నారు. దశాబ్దాల కాలంగా ఈ సమస్య ఉన్నా స్థానిక వైద్యులు ఇప్పటివరకు ఫలానా సమస్య అని గుర్తించలేదు.. సరికదా తరుచూ అనారోగ్యాలు బారిన ఎందుకు పడుతున్నారో చెప్పలేదు. తరుచూ అనారోగ్యం బారిన పడుతూ ఎక్కువ కాలం మంచానికి పరిమితమవుతున్నారు. ఈ బాధపడలేక కొందరు రాజమండ్రిలోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్ళి వైద్యపరీక్షలు చేయించుకోగా అసలు వ్యాధి ఏమిటో బయటపడింది. మెరుగైన వైద్యం పొందాలంటే ఆర్థిక స్థోమతలేని కొండరెడ్లు ప్రాణాలను బిగపట్టుకుని రోజులు లెక్కిస్తూ కాలం వెళ్ళదీస్తున్నారు. కూలీ చేస్తేకాని పూట గడవని వారు మెరుగైన వైద్యం పొందలేకపోతున్నారు. ఈ క్రమంలో ఐదు రోజులు క్రితం కలెక్టర్‌కె.వెట్రి సెల్వి గ్రామంలో పర్యటించడంతో కిడ్నీ సమస్య బహిర్గతమైంది.

బురద నీరే తాగునీరు

గ్రామంలో 75 గృహాలు ఉండగా సుమారు 250 మంది జనాభా ఉన్నారు. కిడ్నిలో రాళ్లు ఏర్పడడంతో బాధ భరించలేక గ్రామానికి చెందిన వేట్ల ఆశోకొరెడ్డి 23-10-2013లో వేట్ల శాంతకుమారి 25-8-2018లో, వేట్ల చిన లచ్చిరెడ్డి 7-8-2023లో రాజమండ్రిలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేయించుకున్నారు. వీరంతా సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు అప్పు చేసి ఆపరేషన్లు చేయించుకున్నారు. వీరే కాక కిడ్నీలో రాళ్ళ సమస్యతో 30 మందికి పైగానే గ్రామంలో ఉన్నారని బాధితులు తెలిపారు.

ఆపరేషన్‌కు రూ.40 వేల వరకు ఖర్చు అవుతుందని ప్రైవేటు వైద్యులు చెప్పడంతో ఆర్థిక స్థోమత లేక వైద్యులు సూచనలను పాటిస్తూ రోజులు గడుపుతున్నారు. రాళ్లు కరిగిపోడానికి స్థానికంగా అందుబాటులో ఉండే వైదాన్ని ఆశ్రయిస్తున్నారు. మెరుగైన వైద్యం పొందేందుకు అధికారులు, దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. సరైన వైద్యం అందక మరణించిన వారు కూడా ఉన్నారని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని మోటారు బోరు నుంచి వచ్చే నీరు బురదగా ఉంటుందని, ఆ నీటిని తాగడం వల్లే కిడ్నిలో రాళ్ళు వస్తున్నట్లు వైద్యులు చెప్పినట్టు కిడ్నీ బాధితులు తెలిపారు. రామనర్సాపురం గతంలో దట్టమైన అటవీ ప్రాంతంలోని గుమ్ములూరులో ఉండేది. అక్కడ వైద్యసేవలు పూర్తిగా అందేవి కావు. రోగాల బారిన పడితే మరణమే శరణ్యంగా ఉండేది. ఆ సమయంలో అన్నింటికి అందుబాటులో ఉండే రామనర్సాపురంలో న్యూడెమోక్రసీ దళ కమాండర్ ధర్మన్న కొండరెడ్లతో పోడు కొట్టించి 1985లో గుడిసెలు వేయించి కొత్త ఊరును ఏర్పాటు చేశారు. ప్రభుత్వం కాలనీ మంజూరు చేసి ఇళ్లు నిర్మించింది. ప్రభుత్వ బడి, అంగనవాడీ కేంద్రం, కమ్యూనిటీ హాలు, మోటార్ బోరు, మంచినీటి ట్యాంకు, విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేసింది. ఈ సంవత్సరమే గ్రామంలో కొత్తగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.





గ్రామంలో నిర్మించిన వాటర్ ట్యాంకు.. గ్రామస్థులు తాగుతున్న బురద నీరు

కలెక్టర్ ఎదుట గోడు ..

ఇటీవల కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఏజెన్సీ పర్యటనలో భాగంగా రామనర్సాపురం వెళ్ళారు. గ్రామం మొత్తం ముక్తకంఠంతో కిడ్నీ సమస్యను ఆమెకు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే గ్రామంలోని మంచినీటిని నిర్ధారణ పరీక్షలు చేయాలని, సుద్ద శాతాన్ని గుర్తించాలని అవసరం అనుకుంటే మరోచోట మంచినీటి బోరును ఏర్పాటు చేయాలని ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజను ఆదేశించారు. వైద్యశిబిరం శిబిరాన్ని ఏర్పా టు చేసి వైద్యసేవలు అందించాల న్నారు. అవసరమనుకుంటే ఐటీడీఏ ద్వారా మెరుగైన వైద్యం అందించ డానికి చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఆమె ఆదేశాల మేరకు బోరు నుంచి నీటి శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు.

కిడ్నీ సమస్యతో గిరిజనుడి మృతి



కన్నపరాజు (ఫైల్)

జీలుగుమిల్లి, జూలై 7 : అంకన్నగూడెం శివారు జగన్నాథపురం గ్రామానికి చెందిన గిరిజనుడు సోడెం కన్నపరాజు (22) అనారోగ్యం తో ఆదివారం మృతి చెందాడు. అతను కొద్ది రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ అనారోగ్యానికి గురయ్యాడు. ఇటీవల తూర్పు గోదావరి జిల్లా చింతూరు బంధువుల ఇంటికి వెళ్లగా పరిస్థితి విషమించింది. తిరిగి గ్రామానికి తీసుకొస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి..



రామనర్సాపురంలో కిడ్నీ సమస్య ఇప్పటిది కాదు. కిడ్నీలో రాళ్ళతో బాధపడేవారి సంఖ్య గ్రామంలో 30 మందికి పైగా ఉన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళుతున్నా రోగం ఏమిటో నిర్ధారణ చేయడం లేదు. దీంతో కొండరెడ్లు అనారోగ్యాల బారిన పడి మృత్యువాత పడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్ళి వైద్యపరీక్షలు చేయిస్తే తప్పా రోగం ఏమిటో తెలియడం లేదు. ఊరు ఊరంతా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ అధికారులు స్పందించి కొండరెడ్లకు మెరుగైన వైద్యసేవలు అందించి ప్రాణాలు కాపాడాలి.

- పోరండ్ల శ్రీనివాస్, న్యూడెమోక్రసీ నాయకుడు



లక్ష్మీపురం ఆలయం నుంచి బయలుదేరిన జగన్నాథుడి రథం

కదిలిన జగన్నాథ రథచక్రాలు

ద్వారకాతిరుమల, జూలై 7: శ్రీజగన్నాథుని దివ్య రథచక్రాలు లక్ష్మీపురం ఆలయం నుంచి శ్రీవారి క్షేత్రం వైపునకు కదిలాయి. శోభాయమానంగా ఆదివారం సాయంత్రం జరిగిన రథయాత్రను వీక్షించిన భక్తజనులు పరవశించారు. అతిపురాతన మైన ఈ ఆలయం శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమై విరాజిల్లుతోంది. ఈ క్రమంలో జగన్నాథుని రథోత్సవాలు ఆదివారం నుంచి ప్రారం భమై ఈనెల 16 వరకు జరుగనున్నాయి. ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని పుష్పమాలికలు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపతోరణాలతో సుందరీకరించారు.

లక్ష్మీపురం ఆలయంలో రథోత్సవాలు ప్రారంభం

రథయాత్ర ఇలా..

అర్చకుల వేదమంత్రోచ్చరణల నడుమ పూరి క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, సమేత జగన్నాథుని దారు విగ్రహాలను అట్టహాసంగా కోవెల నుంచి తెచ్చి రథంలో ఏర్పాటుచేసిన సింహాసనంపై ఉంచి అలంకరించారు. ఆలయ అధికారుల పూజల అనంతరం బలిహరణను సమర్పించి రథయాత్రను ప్రారంభించారు. మేళతాళాలు, సన్నాయి డప్పువాయిద్యాలు, పండితుల వేదమంత్రోచ్చరణలు, కోలాట భజనల నడుమ జగన్నాథ రథయాత్ర ద్వారకాతిరుమల క్షేత్రానికి చేరుకుంది. భక్తులు హారతులు పట్టారు. క్షేత్రంలో తిరుగాడిన అనంతరం రథం తిరిగి లక్ష్మీపురం ఆలయానికి చేరుకుంది.



మత్స్యావతారంలో జగన్నాథుడు

మత్స్యావతారంలో జగన్నాథుడు ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీపురం ఆలయంలో ఆదివారం ఘనంగా ప్రారంభమైన జగన్నాథుని రథోత్సవాలను పురస్కరించుకుని స్వామివారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. దీనిలో భాగంగా తొలిరోజున మత్స్యావతారంలో శంఖు, చక్రాలను ధరించి, గధదారియై భక్తజనులకు అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్టు అలంకరణ చూపరులకు కనువిందు చేసింది.





కైకలూరు రథయాత్రలో భక్తులు ఊరేగుతున్న సుభద్ర, బలరామ సమేత జగన్నాథుడు

వైభవంగా కైకలూరు, వడాలిలో రథయాత్రలు

కైకలూరు/ముదినేపల్లి, జూలై 7: కైకలూరు ఇస్కాన్ రాధాకృష్ణ మందిరం ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహించారు. కైకలూరు శ్యామలాంబ అమ్మవారి ఆలయం నుంచి రథయాత్రను భక్తుల కోలాహలం మధ్య ప్రారంభించారు. భక్తులు రథాన్ని లాగుతూ హరేకృష్ణ సంకీర్తన చేశారు. అనంతరం జరిగిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. రథయాత్ర అనంతరం శ్యామలాంబ అమ్మవారి ఆలయ కళా మండపంలో స్వామి వారికి 56 రకాల ప్రసాదాన్ని (చప్పన్ భోగ) నివేదించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో ఉన్న సుభద్ర, బలరామ సహిత జగన్నాథస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. వడాలి దేవస్థానం వద్ద ప్రారంభమైన జగన్నాథుడి రథయాత్ర ముదినేపల్లి, పెయ్యేరు కాలనీ, శ్రీహరిపురం, సింగరాయపాలెం బావాజీ మఠం వద్దకు సుమారు పది కిలోమీటర్లు కొనసాగింది. దారి పొడవునా భక్తులు రథాన్ని లాగి స్వామికి పూజలు నిర్వహించారు.

విశాఖ రైలుకు రెడ్ సిగ్నల్

- పునరుద్ధరణపై రైల్వే కుంటిసాకులు
- ఆరు నెలలుగా ప్రయాణికులకు ఇబ్బందులు
- కేంద్ర మంత్రులు, ఎంపీల వద్దకు సమస్య



నరసాపురం, జూలై 7 :నరసాపురం-మచిలీపట్నం-విశాఖపట్నం వయా భీమవరం మీదుగా నడిచే లింకు ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేసి ఆరు నెలలు గడుస్తుంది. అప్పట్లో ట్రాక్ పునరుద్ధరణ పేరుతో ఈ రైలును తాత్కాలికంగా ఆపుతున్నట్టు ప్రకటించారు. ఈవిధంగా ప్రతినెల పొడిగిస్తున్నారే తప్ప ఈ రైలుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం లేదు. జిల్లా నుంచి రాత్రి సమయంలో విశాఖ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో నరసాపురం నుంచి పగటిపూట విశాఖకు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఉండేది. ఆ లింకును పూర్తిగా తొలగించారు. తాజాగా నరసాపురం మచిలీపట్నం లింకు ఎక్స్‌ప్రెస్‌ను కూడా నిలుపుదల చేయడంతో ఈ రైలు ఇక పట్టాలెక్కదేమో అనే సందేహాలు వినిపిస్తున్నాయి.

పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉండి, భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు ప్రాం తాల్లో దశాబ్దాల క్రితం ఉపాధి నిమిత్తం వచ్చి స్థిరపడిన వారు చాలాఎక్కువ మంది ఉన్నారు. ఇటు అన్నవరం క్షేత్రానికి వెళ్లే ప్రయాణికులు కూడా ఎక్కువే. ఆర్టీసీ బస్సులు ఉన్నప్పటికీ వందల రూపాయల్లో చార్జీలు ఉండడంతో ఎక్కువ మంది ప్రయాణికులు ఈ రైళ్లల్లోనే వెళ్లేందుకు ఇష్టపడతారు. గతంలో ఉదయం పది గంటలకు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కితే సాయంత్రం ఆరు గంటలకు విశాఖ వెళ్లేవారు. అప్పట్లో చార్జీ వంద రూపాయలు ఉండేది. అన్నవరానికి రూ.75 ఉండేది. ఈ రైలును రద్దు చేసి నరసాపురం నుంచి దీనికి డెమో రైలు పెట్టారు. ప్రయాణికులు నిడదవోలు దిగి గుంటూరు నుంచి వచ్చే సింహాద్రి ఎక్కాల్సి వస్తుంది. కొన్ని సమయాల్లో ప్లాట్‌ఫాంలు మారాల్సి రావడంతో వృద్ధులు, చిన్న పిల్లలతో వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రైలులో సీట్లు దొరకని పరిస్థితి. ఈ కష్టాలు పడలేక చాలామంది నరసాపురం నుంచి రాత్రి పదకొండు గంటలకు వెళ్లే లింకు ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ, అన్నవరం తదితర ప్రాంతాలకు ప్రయాణమవుతున్నారు. ఈ ఏడాది ఆరంభంలో ట్రాక్ పనుల పేరుతో రద్దు చేశారు. అప్పటి నుంచి ఇదిగో... అదిగో అంటూ రైల్వే కుంటి సాకులు చెప్పుతున్నారే తప్ప రెడ్‌సిగ్నల్ మాత్రం తీయడం లేదు. దీనిపై నరసాపురం, భీమవరం, తణుకు, పాలకొల్లు తదితర ప్రాంతాల్లో రైల్వే అధికారులకు ప్రయాణికులతో పాటు పలు సంఘాలు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ స్పందన లేదు.

కేంద్ర మంత్రుల దృష్టికి..

కేంద్రం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడంతో జిల్లాలో స్థిరపడిన ఉత్తరాంధ్ర వాసులు ఈ సమస్యను కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మతో పాటు శ్రీకాకుళం జిల్లాకు చెందిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో వీరంతా రైల్వే మంత్రిని కలవనున్నట్టు తెలియవచ్చింది. అప్పటికైనా ఈ రైలు రెగ్యులర్‌గా నడుస్తోందా లేదా మళ్లీ మూడునాళ్ళతో సరిపెడతారా అనేది సస్పెన్స్‌గా మారింది.

అండర్-19 జిల్లాస్థాయి చెస్ విజేతలు



చెస్ విజేతలతో అసోసియేషన్ సభ్యులు

భీమవరం అర్బన్, జూలై 7: జిల్లాస్థాయి అండర్-19 చెస్ పోటీలు అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సహకారంతో ఆదివారం భీమవరం అనసూయ చెస్ అకాడమీలో నిర్వహించారు. పోటీలకు జిల్లాల నలు మూలల నుంచి సుమారు 30మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలలో మొదటిస్థానం ఎన్.వరుష్‌తేజ్, రెండో విజేతగా ఎ.శివసాయి కార్తీక్, మూడో స్థానంలో ఈ.దేహన్స, నాలుగో స్థానంలో ఎన్.కుష్వంత్ నిలిచారన్నారు. వీరు ఈనెల 18, 19వ తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-19 చెస్ పోటీలలో పాల్గొంటారని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు చెస్ అసోసియేషన్ సభ్యులు మైలాపురి మురళి, నోముల రామారావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు.

సెప్టెంబరులో జాతీయ స్థాయి కరాటే పోటీలు



కప్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు రూరల్, జూలై 7: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సెప్టెంబరు 14,15వ తేదీల్లో బడేటి ఛాలెంజ్ కప్ పేరుతో ఆంధ్రప్రదేశ్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో కరాటే పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం స్థానికంగా పోటీలకు సంబంధించి టోర్న మెంట్ కప్‌ను ముఖ్యఅతిథిగా ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. విద్యార్థులను రాష్ట్ర, జాతీయస్థాయి కరాటేలో పాల్గొనేలా శిక్షణ ఇస్తున్న ఇబ్రహీమ్‌బేగ్, సెహన్నాలను అభినందించారు ఇండియా కరాటే చీఫ్‌కోచ్ ఇబ్రహీమ్‌బేగ్ మాట్లాడుతూ రెండేళ్లకొకసారి జాతీయస్థాయిలో కరాటే పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది 15వ సారి ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 15 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో నాదం శివ, కవులూరి చంద్రశేఖర్, ఈతకోట శ్రీనివాసరావు, బెల్లంకొండ కిషోర్, అమరావతి అశోక్‌బాబు, కరాటే మాస్టర్లు రాధా, పలువురు ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



వాహన డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్

ఏలూరు క్రైం, జూలై 7 : ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో జిల్లాలో ఉన్న పోలీసులు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. రాత్రి వేళ రోడ్డు ప్రమాదాలు జరుగకుండా వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, లాడ్జీలలో అనుమానాస్పదంగా ఉన్న వారిని ప్రశ్నించారు. ప్రార్థనాల యాలు, బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఏ విధమైన అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా ముందస్తుగా రాత్రిపూట ఆ ప్రాంతాలను తనిఖీలు చేశారు. గంజాయి, సారా, అక్రమ మద్యం రవాణా జరుగకుండా జాతీయ, రాష్ట్రీయ రహదారులపై విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు. ద్విచక్ర వాహనదా రులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్లు ఉండడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని సూచించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

భీమవరం క్రైం, జూలై 7 : భీమవరం టూటౌన్‌లోని టౌన్ రైల్వేస్టేషన్ రోడ్డులో ఆదివారం ఓ వ్యక్తి కర్ర పట్టుకుని జనాన్ని భయభ్రాంతులకు గురిచేశాడు. కనిపించినవారిని కొట్టడంతో స్థానికులు ఆందోళన చెందారు. ఎస్ఐ జీకే ప్రసాద్, సిబ్బంది వెళ్లి అతడిని అడ్డుకున్నారు. మతిస్థిమితం లేకపోవడం కారణమని గతంలో ఇలాగే ప్రవర్తించేవాడని స్థానికులు చెప్పారు.

ప్రత్తిపాడులో జనసైనికుల స్వచ్ఛ భారత్

పెంటపాడు, జూలై 7: ప్రత్తిపాడులో ఆదివారం జన సైనికులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. జనసేన గ్రామ అధ్యక్షుడు చెరుకూరి జగత్ సోమశేఖర్ ఆధ్వర్యంలో బీసీ కాలనీలో డ్రెయినేజీలు శుభ్రం చేయడంతో పాటు, ప్రాథమిక పాఠశాల ఆవరణ మెరక వేయడం, పార్కులో తుప్పలను తొలగించారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మజ్జి అప్పారావు, బీజేపీ నాయకుడు ఆరాధ్యుల అంజి, పెనుమాక బాబు, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ పరిస్థితులకు ప్రతిబింబాలే నాటికలు

» నాలుగో రోజు రసవత్తరంగా సాగిన పోటీలు

ఏలూరు రూరల్, జూలై 7 : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు వాస్తవ పరిస్థితులను కళ్లకు కట్టినట్టు చూపించే ప్రతిబింబాలే నాటికలు అని హేలాపురి కళాపరిషత్ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ అన్నారు. వైఎంహెచ్‌ఏ హేలాపురి కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్రస్థాయి నాటికపోటీలు నాలుగో రోజు ఆదివారం అలరించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని మేల్కొల్పడంలో నాటికలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. నాటిక పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి.

'కౌసల్య సుప్రజరామ' నాటిక..

కొలకలూరి శ్రీసాయి ఆర్ట్స్ వారిచే 'కౌసల్య సుప్రజరామ' నాటిక ప్రదర్శించారు. రామాయణంలో రాముడు అరణ్యానికి వెళుతుంటే భర్త దశరథుడి మీద గౌరవంతో కుమారుడి అరణ్య ప్రయాణాన్ని కౌసల్య ఎలా అడ్డుకోలేకపోయిందో కలియుగంలో కూడా ఉద్యోగాల పేరిట విదేశాలకు వెళుతున్న పిల్లలను అడ్డుకోలేకపోతున్నారనే ఇతివృత్తంతో నాటిక సాగింది. అమ్మమనసు మాత్రం బిడ్డలను ఎప్పుడూ అంటిపెట్టుకునే ఉంటుంది. బిడ్డల కష్టాలకు, కన్నీళ్ళకు ఓదార్పుగా నిలబడుతూనే ఉంటుంది. అమ్మ మనస్సుకు ఒక ధర్మం ఉందని, అది కనిపెంచిన ధర్మం, అది కనిపించని ధర్మం అంటూ అమ్మగొప్పతనాన్ని మనస్సుకు హత్తుకునేలా వివరించారు. స్నిగ్ధా రచించిన ఈ నాటకానికి గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. అనంతరం వి.రామాంజనేయులచే మయసభ ఏకపాత్రాభినయం, మండవ రాజాగోపాల కృష్ణ సంబరాతుల ఏకపాత్రాభినయం, పి.విజయ్‌కుమార్, డి.రంగారావులచే రామభక్త హనుమాన్ పద్యనాటిక అలరించింది. ఈ కార్యక్రమానికి కేబీరావ్, ఎం.డి.ఖాజావలీ, గుత్తా కౌసలేంద్రరావు, చెన్నా వెంకటరామయ్య, వైఎంహెచ్‌ఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





కౌసల్య సుప్రజరామ నాటిక.. మయసభ ఏకపాత్రాభినయం.. రామభక్త హనుమాన్‌లో సన్నివేశాలు

మార్మోగిన గోవింద నామస్మరణ

» శ్రీవారి క్షేత్రానికి తరలివచ్చిన 20 వేల మంది భక్తులు

ద్వారకాతిరుమల, జూలై 7: గోవింద నామస్మరణతో చిన్నతిరుమలేశుని క్షేత్రం మార్మోగింది. ఆషాడమాసంలో ఆదివారం నెలపొడుపు కావడంతో పాటు అందరికీ సెలవు దినం కావడంవల్ల అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మికత వెల్లువిరిసింది. ఆలయానికి దాదాపు 20 వేల మంది పైబడి యాత్రికులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్టు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. ఆలయానికి వచ్చిన పలువురు భక్తులు ముందుగా కేశ ఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. సాధారణ దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది.

అలరించిన కోలాట ప్రదర్శన

చినవెంకన్న ఆలయ శ్రీహరి కళాతోరణ వేదికపై మహిళలు, బాలలు ఆధ్వర్యంలో జరిగిన కోలాట ప్రదర్శన చూపరులను అలరించింది. సంప్రదాయ దుస్తులను ధరించిన వారు ముందుగా ఆలయంలోకి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం కళాతోరణ వేదికపై చేరి పలు దేవతామూర్తులను కీర్తిస్తూ వారు నిర్వహించిన కోలాటప్రదర్శన భక్తులను అబ్బురపరిచింది.



↑శ్రీవారి దర్శనానికి క్యూకాంప్లెక్స్‌లో వున్న భక్తులు



మహిళలు, బాలల కోలాట ప్రదర్శన



బురదమయంగా మార్కెట్ రోడ్లు

మార్కెట్ బురదమయం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 7:తాడేపల్లిగూడెం మార్కెట్ బురదమయంగా మారింది. ఆదివారం కూరగాయల మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ బురదమయం అయ్యాయి. మార్కెట్‌లో చెత్త ఇష్టారాజ్యంగా వదిలేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. వినియోగదారులు కనీసం నడవడానికి కూడా వీలులేకుండా రోడ్లు ఛిద్రంగా మారాయి. మున్సిపల్ అధికారులు మార్కెట్ రోడ్లు బురదలేకుండా శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.

మోటారు సైకిల్ అపహరణ

ఉంగుటూరు, జూలై 7:ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామంలో అచ్యుత గంగాధరరావుకు చెందిన మోటారు సైకిల్ ఇంటి వద్ద నిలుపగా శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి తస్కరించినట్టు తెలిపారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్ ఆదివారం తెలిపారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుడి అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన గంజాయి కేసులో నిందితుడు

ఏలూరు క్రైం, జూలై 7 : గంజాయి రవాణా కేసులో తప్పించుకుని అప్పటి నుంచి పరారీలో ఉన్న ఓ నిందితుడిని ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్, ఏలూరు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి వారి సిబ్బంది ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. 2020లో ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి రవాణా చేస్తున్న వారిని అరెస్టు చేయగా ఓ వ్యక్తి పారిపోయాడు. పారిపోయిన వ్యక్తి విశాఖపట్టణం జిల్లా రోలుగుంట మండలం భూపాలపట్నంకు చెందిన గోడె పసుపతి అలియాస్ రమణ అప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఇటీవల నేర సమీక్ష సమావేశం నిర్వహించి గంజాయి కేసుల్లో నిందితులను అరెస్టు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో ఏలూరు డీఎస్పీ ఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గోడె పసుపతి అలియాస్ రమణను అరెస్టు చేశారు.

ఇద్దరిపై కేసు

ఉండి, జూలై 7: ఇరువురు వ్యక్తులపై కేసులు నమోదు చేసిన ఘటన ఉండిలో జరిగింది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉండిలో ఇసుకదొడ్డి ప్రాంతానికి చెందిన సర్వసిద్ధి అప్పన్న అదే ప్రాంతానికి చెందిన సామంతులు మాధవి ఘర్షణ పడ్డారు. ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ ఎస్సయ్య తెలిపారు.

క్రైం కార్నర్

శ్రీరామవరంలో ఫ్లెక్సీ వివాదం.. ఉద్రిక్తత

టీడీపీ బ్యానర్‌ను చింపారని.. వైసీపీ.. టీడీపీ శ్రేణుల మధ్య తోపులాట

దెందులూరు, జూన్ 7 :దెందులూరు మండలం శ్రీరామవరం గ్రామంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు టీడీపీ బ్యానర్‌ను చింపివేశారు. ఈ మేరకు వైసీపీ.. టీడీపీ కార్యకర్తల మధ్య ప్రారంభమైన వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. ఇరువర్గాల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. సమాచారం తెలుసుకున్న దెందులూరు ఎస్ఐ స్వామి, సీఐ కొండశీనివాస్, పోలీసులు బందోబస్తుతో వచ్చి అదుపు చేశారు. సోమవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమం ఉండడంతో వైసీపీ నాయకులు గుమిగూడడంతో పాటు తమ ఫ్లెక్సీని చింపారని టీడీపీ.. వైసీపీ కార్యకర్తల మధ్య కొద్దిసేపు రాళ్ల రువ్వుకున్నారు. ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టి అక్కడ నుంచి పంపిం వేశారు.

ఆన్‌లైన్ యాప్‌లో రూ.93.55 లక్షలు మాయం

» మోసపోయిన మహిళ.. చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, జూలై 7 :ఆన్‌లైన్ యాప్ ద్వారా దఫదఫాలుగా 93 లక్షల 55 వేల 500 రూపాయలు పెట్టుబడిపెట్టి ఆపై మోసపోయానని భావించిన ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఏలూరు శాంతినగర్‌కు చెందిన ఎ.నవ్యలక్ష్మి వాట్సాప్‌కు 2023 డిసెంబరు 26న ఎ.చంద్రశేఖర్ అనే వ్యక్తి నంబరు ద్వారా పాంథసెస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని పెట్టుబడులు పెడితే రెట్టింపు అవుతాయని మెసేజ్ పెట్టడంతో వాటిని నమ్మి దఫదఫాలుగా ఇప్పటివరకు 93 లక్షల 55 వేల 500 రూపాయలు పెట్టుబడి పెట్టారు. సొమ్ములు ఎప్పటికీ తిరిగి రాకపోవడంతో అనుమానం కల్గి ఆ ఫోన్ నంబరుకు ప్రయత్నించగా స్విచ్‌ఆఫ్‌లో ఉంది. ఈ మేరకు బాధితురాలు ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పది మంది జూదరుల అరెస్ట్

ఉంగుటూరు, జూలై 7:చేబ్రోలు పోలీసు స్టేషన్ పరిధిలో పేకాటాడుతున్న పది మందిని అరెస్ట్ చేశామని చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్ తెలిపారు. ఆదివారం నారాయణపురం శివారులో పేకాటాడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. దాడిలో పది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ2200 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

గడ్డపారతో గాయపర్చిన మహిళపై కేసు

టినరసాపురం, జూలై 7 : రెండు ఇళ్ల మధ్య వర్షపు నీటి ప్రవాహంపై జరిగిన ఘర్షణలో ఒక మహిళను కొట్టిన మరో మహిళపై కేసు నమోదు చేశామని ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. వల్లంపట్ల పంచాయతీ శింగరాయపాలెంలో ముళ్ళగిరి భవాని, జక్కం రాధ ఇళ్ల మధ్య వర్షపు నీటి ప్రవాహానికి సంబంధించి శనివారం ఇద్దరు మహిళలు ఘర్షణ పడ్డారు. కోపోద్రికురాలైన భవాని గడ్డపారతో రాధను కొట్టడంతో గాయమైంది. బాధితురాలిని కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో ఆదివారం భవానిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

షిరిడీ వెళ్లొచ్చేసరికి ఇంటిని దోచేశారు

మొగల్తూరు, జూలై 7 : మోడి గ్రామంలోని ఓ ఇంటిలో చోరీ జరిగిందని బాధితుడు ఆదివారం మొగల్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోడి పంచాయతీకి చెందిన వన్నెంరెడ్డి కేశవరాయుడు ఈనెల 3వ తేదీన కుటుంబ సభ్యులంతా కలిసి షిరిడీ వెళ్లారు. అక్కడ నుంచి ఆదివారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులకొట్టి ఉండడంతో పాటు ఇంటిలోని బీరువా తాళాలు పగులకొట్టి దుండగలు ఐదు కాసుల బరువు గల మూడు బంగారు చైన్‌లు, నాలుగు గ్రాముల రూపు, వెండి సామగ్రిని దొంగిలించినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. పోలీసులు క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరిస్తున్నారు.

మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలు



జీలుగుమిల్లి, జూలై 7 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన జీలుగుమిల్లి శివారు రమణక్కపేట వద్ద ఆదివారం రాత్రి జరిగింది. జీలుగుమిల్లి శివారు రమణక్కపేట వద్ద జాతీయ రహదారిపై బైక్‌పై వెళుతూ ఓ వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలపాలై రక్తపు మడుగులో అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానికులు చూసి 108కు సమాచారం ఇచ్చారు. జీలుగుమిల్లి 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురానికి చెందిన షేక్ సమీర్‌గా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

కాక్..

భారీ తోటకూర మొక్క

» గొల్లలకోడేరులో 11 అడుగులకు ఎదిగిన వైనం

పాలకోడేరు, జూలై 7: తోటకూర అంటే ఇష్టపడని వారుండరూ, చూడని వారు ఉండరు కానీ పదకొండు అడుగుల ఎదిగిన తోటకూర మొక్కను అతితక్కువ మంది మాత్రమే చూసుంటారు. పాలకోడేరు మండలం గొల్లలకోడేరుకు చెందిన మాజీ సర్పంచ్ గాదిరాజు వెంకటసత్యసూర్యనారాయణరాజు నివాసంలో ఈ మొక్క కనువిందు చేస్తోంది. రెండు నెలలక్రితం పెరట్లో తోటకూర విత్తనాలు వేయగా అందులో ఒక మొక్క అబ్బురపరిచే విధంగా పదకొండు అడుగులు పెరిగింది. ఇంటికి వచ్చిన పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఫొటోలు దిగి వెళ్తున్నారు.



తోటకూర మొక్కతో మాజీ సర్పంచ్ సూర్యనారాయణరాజు

రోడ్డుపైకి గురస చేపలు

» పోలవరంలో కురిసిన భారీ వర్షం..

పోలవరం జూలై 7 : పోలవరంలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. స్థానిక బెస్తావీధిలో వర్షపు నీటికి బోదెల్లో చేపలు రోడ్లపైకి ఎదురెక్కడంతో స్థానికులు చేపలను పట్టుకుని కవర్లలో తీసుకువెళ్లారు. సుమారు రెండు బస్తాల గురస చేపలు స్థానికులు ఏరుకుని పట్టుకుని ఇళ్లకు వెళ్లారు. మండలంలో గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ఇటుకలకోట, తదితర పంచాయతీలలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పోలవరం మెయిన్ రోడ్డు, బెస్తావీధి, కొత్తపేట, బాపూజీ కాలనీలలో డ్రెయినేజీ వ్యవస్థ సరిలేక నీరు నిలిచిపోవడంతో ప్రజానీకం అవస్థలకు గురయ్యారు.



రోడ్డుపైకి చేరిన చేపలు



స్థానికులు కవర్లలో వేసుకున్న చేపలు

చెరువు పూడిక తీత పనులకు శ్రీకారం


భూమి పూజ చేసిన ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, జూలై 7 : తమ ప్రభుత్వం చెరువుల పూడిక తీత పనులకు ప్రాధాన్యత ఇస్తుం దని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మ రాజు అన్నారు. యర్రమిల్లిపాడు చెరువు పూడికతీత పనులకు ఆదివారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతనం ఎమ్మెల్యే కొల్లేటి పెద్దింట్లమ్మను దర్శించుకున్నారు. సర్పంచ్ తమ్మిన శ్రీను,ఉప సర్పంచ్ చిలుకూరి రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు పాతూరి విజయకుమార్, కైకలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐ, వంగా రఘు, చింతలపాటి బాసి రాజు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, జూలై 7 : చేబ్రోలు ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించేందుకు ఆదివారం వచ్చిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట చేబ్రోలు సర్పంచ్ రాంధే లక్ష్మీసునీత, మండల టీడీపీ అధ్యక్షుడు పాతూరి విజయకుమార్, చేబ్రోలు పంచాయతీ కార్యదర్శి బొడ్డు రవి కుమార్, జనసేన నాయకులు చింతలపాటి బాసిరాజు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల వినతి


ఎమ్మెల్యే బాలరాజుకు వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

జీలుగుమిల్లి, జూలై 7 : అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఐసీడీఎస్ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సీఐటీయూ ఆధ్వర్యంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కోరారు. తమ పరిధిలో సమస్యలు పరిష్కరిస్తామని స్థాయికి మించి సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. అధికారం రాక మునుపే అంగన్‌వాడీ కార్యకర్తలకు అండగా నిలిచామన్నారు. యూనియన్ నాయకులు వి.కృపామణి, యు.నాగమణి, ఎం.నాగమణి, కె.పుష్ప, టి.రామలక్ష్మీ, టి.ఎస్తేరు ఉన్నారు.

నూతన భవనాల నిర్మాణం పూర్తి చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఏలూరు అర్బన్, జూలై 7 : ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవనాల నిమిత్తం స్థలాన్ని కేటాయించి రెండేళ్ల గడుస్తున్నప్పటికీ ఇంత వరకు నిర్మాణాల్లో పురోగతి లేదని విద్యార్థులు తరగతులు కోల్పోతున్నారని పీడీఎస్‌యూ జిల్లా నాయకుల బృందం ఆదివారం ఎమ్మెల్యే బడేటి చంటిని కలిసి ఫిర్యాదు చేసింది. వివరాలను సంఘ జిల్లా అధ్యక్షుడు కె.నాని పత్రికలకు విడుదల చేశారు. కేటాయించిన స్థలంలోనే తరగతి గదులు త్వరితగతిన నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేని కోరామన్నారు. లేనిపక్షంలో ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యేకు స్పష్టం చేశామన్నారు. నీట్, యూజీ పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించేలా ప్రభుత్వం తరఫున కృషి చేయాలని కోరామన్నారు. ఎన్టీఏను రద్దు చేసి, నిష్పక్షపాతంగా పరీక్షను నిర్వహించే స్వయంప్రతిపత్తి వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో క్రాంతి, యశ్వంత్, చందన్, విష్ణు, విజయ్ తదితరులున్నారు.

బాబురావు మృతి బాధాకరం : ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు, జూలై 7 : తాను చనిపోయినా తన నేత్రలు మరో ఇద్దరికి చూపు ఇవ్వాలని కోరుకున్న కొలుసు వీరవెంకట సత్యనారాయణ అలియాస్ (ఆర్టీసీ బాబురావు) గుండె నొప్పితో మృతి చెందడం చాలా బాధాకరమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు యాదవ్ నగర్‌కు చెందిన కొలుసు బాబురావు(62) ఆదివారం తెల్లవారు జామున మృతి చెందారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి కుటుంబ సభ్యులు బాబురావు నేత్రలను దానం చేశారు ఆయన పార్థివ దేహానికి ఎమ్మెల్యే ప్రభాకర్, తణుకులోని ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ మోటపర్తి రాజాబాబు, విజయనగేష్ డీఈడీ కాలేజీల చైర్మన్ సుకరాజు, మానవత సంస్థ మండల అధ్యక్షుడు సంపంగి తిలక్, మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, ఆర్టీసీ ఉద్యోగులు, కూటమి శ్రేణుల, వైసీపీ నేతలతో పాటు పలువురు నివాళులర్పించారు. బాబురావు కుమారుడు బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కొలుసు నాని, మరో కుమారుడు, కుమార్తెను పలువూరు ప్రముఖులు, పరామర్శించారు.

డ్రైనేజి పూడికతీత పనులు ప్రారంభం


పాత బస్టాండ్ ఏరియాలో డ్రైనేజి పూడిక తీస్తున్న కార్మికులు

చింతలపూడి, జూలై 7: స్థానిక మెయిన్‌రోడ్డుకు ఇరుపక్కల ఉన్న డ్రైనేజీలలో పేరుకుపోయిన పూడిక తీసే పనులను ఆదివారం ప్రారంభించారు. డ్రైన్లు పూడుకుపోవడంతో వర్షాలకు డ్రైనేజిల్లోని మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. ఇటీవల ఎమ్మెల్యే రోషన్ కుమార్ చొరవతో ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులకు ఆక్రమణలు తొలగించి పూడికలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన కూడా స్వయంగా దుకాణదారులను కలిసి ఆక్రమణలు తీసే క్రమంలో సహకరించాలని సూచించారు. దీనిపై మున్సిపల్ అధికారులు మైక్ ప్రచారం చేశారు. ఈ పూడిక పనులు చేపట్టడానికి ఏలూరు నుంచి ప్రత్యేకంగా కార్మికులను పిలిపించి పనులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రాజు ఏ విధంగా చేయాలో వారికి సూచనలు ఇచ్చారు. పాత బస్టాండు ఏరియా నుంచి అధికారుల సమక్షంలో ఈ పనులు ప్రారంభించారు.

అనాథ మృత దేహానికి అంత్యక్రియలు

చింతలపూడి, జూలై 7: స్థానిక ఏరియా ఆసుపత్రి బయట షెల్టర్‌లో అనాథ మృత దేహాన్ని ఆదివారం గుర్తించారు. మున్సిపల్ సిబ్బంది, పోలీసులు ఈ మృతదేహానికి బరియల్ గ్రౌండ్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు భిక్షగాడని, వివరాలు తెలియదని, గత అర్ధరాత్రి చనిపోయినట్లు సమాచారం వచ్చిందని ఎస్‌ఐ కుటుంబరావు తెలిపారు.

గ్రంథ పఠనంతో విజ్ఞానం


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పెదవేగి, జూలై 7 : గ్రంథ పఠనం అభివృద్ధికి చిహ్నమని పెదవేగి శాఖా గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వచ్చినప్పుడే విజ్ఞానం సొంతమవుతుందన్నారు. పుస్తక పఠనం వలన కలిగే ప్రయోజనాలకు విద్యార్థులకు వివరించారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హంతకులను అరెస్టు చేయాలి

ఏలూర టూ టౌన్, జూలై 7: తమిళనాడు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్య చేసిన హంతకులను గుర్తించి తక్షణం అరెస్టు చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నేతల రమేష్‌బాబు డిమాండ్ చేశారు. నవ సమాజ్ సొసైటీ కార్యాలయంలో ఆర్మ్‌స్ట్రాంగ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఖిల భారత తపాల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సంఘం జాతీయ అధ్యక్షుడు దాసరి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యవాదులంతా ఇటువంటి హత్యలను ఖండించాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్, కె.స్వామి, కె.మల్లిఖార్జున్, వెంకటరమణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను అప్‌కాస్‌లో చేర్చాలి

ఏలూర టూ టౌన్, జూలై 7: చింతలపూడి మున్సిపల్ కార్మికులను అప్‌కాస్‌లో చేర్చి కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు బాలరాజు డిమాండ్ చేశారు. ఏలూరు సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు సోమయ్య మాట్లాడుతూ కనీస వేతనం రూ.21 వేలు, హెల్త్ అలవెన్సులు, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలన్నారు. జూలై 10న దేశవ్యాప్తంగా జరిగే జాతీయ కోర్కెల దినోత్సవంలో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో రమేష్, ఎల్.కృష్ణారావు, నాగరాజు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ సిబ్బంది పై జేసీ ఆగ్రహం


జీసీసీ గొడౌన్‌లో నిల్వలు పరిశీలిస్తున్న జేసీ లావణ్యవేణి

కుక్కునూరు, జూలై7: ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యం, నిత్యావసర సరుకుల నిల్వలు వర్షపు నీటికి తడవకుండా చర్యలు తీసుకోకపోవడంపై గిరిజన సహకార సంస్థ (జీసీసీ) సిబ్బందిపై జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ సప్లైస్ ద్వారా తెల్లరాయిగూడెం పునరావాస కాలనీ, జీసీసీ గొడౌన్‌లో ఉంచిన బియ్యం, నిత్యవసర నిల్వలను ఆదివారం జేసీ పరిశీలించారు. రాబోయే గోదావరి వరదల సమయంలో ముందుగా ఎక్కడెక్కడ బియ్యం, నిత్యవసర వస్తువులు నిల్వ ఉంచారో వాటి వివరాలను జేసీ అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే జీసీసీ గొడౌన్ లోపల పరిశీలించారు. జీసీసీ గొడౌన్ వెంటిలేటర్లు, శ్లాబ్ నుంచి వర్షపు నీరు బియ్యం బస్తాల పైపడి నిల్వలు పాడయ్యే అవకాశం ఉందని జేసీ గుర్తించారు. వేలాది టన్నుల బియ్యాన్ని గొడౌన్‌లో ఉంచుతున్నప్పుడు ఆ భవనానికి కనీసం మరమ్మతులు కూడా ఎందుకు చేసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం అందిస్తున్న బియ్యం తడిస్తే ఆ బియ్యాన్నే ప్రజలకు అందిస్తారా అని జేసీ సిబ్బందిని ప్రశ్నించారు. వరదలు వచ్చే క్రమంలో ప్రజలకు వెంటనే అందించడటానికి నిర్దేశించిన ప్రాంతంలో బియ్యం, సరుకులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లైస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డీఎం మంజుభార్గవి, తాహసీల్దార్ అచ్యుత కుమారి పాల్గొన్నారు.

జేసీకి సమస్యలు విన్నవించిన కూటమి నాయకులు

కుక్కునూరు మండలంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి అధ్వానంగా మారిందని కనీసం నడవటానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణికి కూటమి నాయకులు సమస్యలు విన్నవించారు. కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో జేసీని కలిశారు. ఐదేళ్లుగా కనీస మరమ్మతులు చేయకపోవడంతో 40 కిలోమీటర్ల రహదారి అంతా గోతుల మయంగా మారిందని తెలిపారు. కనీసం మరమ్మతులైన చేపట్టాలని జేసీని కోరారు. జేసీ స్పందిస్తూ ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు యుగంధర్, పులి శ్రీను, సాంబశివరావు, చుంచు సత్యనారాయణ, మంత్రి గోపాలకృష్ణ, వెంకన్నబాబు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో సామాజిక దృక్పథం ఉండాలి


సత్యవోలులో పేదలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

పెదపాడు, జులై 7 : ప్రతి ఒక్కరిలోనూ సామాజిక దృక్పథం అవసరమని, అది వారికి సమాజంలో తగిన గుర్తింపు తెస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడు మండలం సత్యవోలు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్ తల్లిదండ్రులు రామకృష్ణ శాయోజీరావు, రామ చంద్రకుమారి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మంచినీటి వాటర్ ట్యాంకర్‌ను ఎమ్మెల్యే చింతమనేని ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఉప్పలపాటి రాంప్రసాద్‌తో కలిసి నిరుపేదలకు దుస్తులను అందజేశారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామ అవసరాలకు ఉపయోగపడేలా ట్యాంకరును ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఇదేవిధంగా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్యవోలు సర్పంచ్ టీడీపీలో చేరిక

సత్యవోలు గ్రామ సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి వైసీపీని వీడి చింతమనేని సమక్షంలో టీడీపీలో చేరారు. ఆమెకు ఎమ్మెల్యే చింతమనేని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించి, సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఈ సందర్భంగా ప్రభాకర్ తెలిపారు.

రజక చెరువుల మీద శాశ్వత హక్కు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు రూరల్, జూలై 7: రజక వృత్తిదారులకు వారికి కేటాయించిన చెరువుల మీద వారికే శాశ్వత హక్కు కల్పించాలని అధికారులు ప్రభుత్వ జీవోలను అనుసరించకపోవడం వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని, రజక జన సంఘ జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. సంఘ భవనంలో ఆదివారం సమావేశం జరిగింది. ఉండి నియోజకవర్గం కాళ్ల మండలం రజకుల ఇబ్బందులపై చర్చించారు. రజక వృత్తి చెరువుల మీద శాశ్వత హక్కులు కల్పించాలని యర్రంపేట గ్రామంలో రజక సంఘానికి ఎంపీ నిధులు రూ.10 లక్షలతో రజక కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. అనంతరం తొమ్మిది మందితో యర్రంపేట గ్రామ రజక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.శ్రీను, ఉపాధ్యక్షుడిగా డి.రాము, కార్యదర్శిగా ధర్మయ్య తదితరులు ఎన్నికయ్యారు.

సబ్సిడీపై గానుగ యూనిట్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న గురుమూర్తి

ఏలూరు రూరల్, జూలై 7: గానుగ వృత్తి చేసుకునేవారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించాలని, సబ్సిడీపై గానుగ యూనిట్లు అందజేసి 300 యూనిట్లు విద్యుత్ సబ్సిడీ అందించాలని, అఖిల గాండ్లతేలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి గురుమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏలూరులో ఆదివారం సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 16 లక్షల మంది గాండ్ల తేలికుల కులస్థులున్నారని, 90 శాతం మంది పేదవారే అన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ పెరగడంతో వృత్తి పై ఆధారపడిన వారు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. అలాగే ద్వారకాతిరుమల క్షేత్రం సమీపంలో వెయ్యి గజాలు స్థలం కేటాయించాలని, కల్యాణ మండపం నిర్మించుకుంటామని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వెల్లంకి వైష్ణవి ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబర్చడంతో ఉన్నత విద్యకు ఆర్థిక సాయం అందజేశారు. టి.వెంకటశ్రీనివాస్, వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాట్నాలమ్మకి ప్రత్యేక పూజలు

పెదవేగి జూలై 7 : రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.59,455లు, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.33,780లు, ఫోటో విక్రయాల ద్వారా రూ.4,550లు ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.10,784లు విరాళాలు అందజేశారన్నారు.

పోలవరం వాసులకు తప్పని విద్యుత్ కష్టాలు

రెండు రోజులుగా నరకయాతన


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పోలవరం, జూలై 7 : గ్రామస్థులను తరచూ విద్యుత్ సమస్యలు వెంటాడుతున్నాయి. గంటల తరబడి కరెంట్ పోతుండడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం ఐదు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా లేకపోవ డంతో దోమలు , ఉక్కబోత తో తీవ్ర ఇబ్బందలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన చేందుతున్నారు. అధికారులు స్పందించి, శాశ్వత పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈ కొండా సత్యనారాయణను వివరణ కోరగా వ్యాక్యూమ్ సర్క్యులేషన్ బ్యాకం కాలిపోవడం వలన సమస్య తలెత్తిం దని, అది పూర్తిగా పనిచేయకుండా పోయిందన్నారు. ఈ సమస్య పరిష్కారం ఏలూరు సిబ్బంది మాత్రమే చేయగలరని, అప్పటి వరకు కడమ్మ ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. దీనికి తోడు లైన్‌మెన్ ఒక్కరే ఉండడం వలన హెల్పర్ల సాయంతో పనులు కొనసాగిస్తున్నామని, రెండు రోజుల్లో సమస్య పరిష్కరించి లైన్లు పునరుద్ధరిస్తామన్నారు.

'మానవత' సేవలు మరింత విస్తరిస్తాం


కొయ్యలగూడెం మండల మానవత నూతన కార్యవర్గం

ద్వారకాతిరుమల, జూలై 7: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు మరింతగా విస్తరిస్తానని సంస్థ మండల నూతన అధ్యక్షుడు దేవరపల్లి రాయుడు బాబు అన్నారు. ద్వారకా తిరుమలలో మానవత సంస్థ సమావేశం ఆదివారం జరిగింది. ముందుగా 2024-25కి గాను నూతన కార్యవర్గ ఎన్నికలు జిల్లా అధ్యక్షుడు టి.మోహనరావు, ఆలపాటి నాగేశ్వరరావు సమక్షంలో జరిగాయి. అధ్యక్షుడిగా దేవరపల్లి రాయుడుబాబు, కార్యదర్శిగా కూన పాము రామారావు, కోశాధికారిగా నాదెళ్ల బుల్లివెంకటరావు, ఉపాధ్యక్షు డిగా కిలారపు రుక్మిణీ నాథ్, జాయింట్ కార్యదర్శిగా ఆలపాటి శ్రీనివాస రావు, ఈసీలుగా చెన్నుబోయిన నరసింహారావు, నాదెళ్ల మంజునాథ్, వీబీవీఎస్ నాగేశ్వరరావు, డి.వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శాంతిరథం కొనుగోలుకు రూ.5.25 లక్షలు విరాళంగా అందించిన ఎంఎస్‌ఆర్‌ను, లక్ష్మీ రమణిని సత్కరించారు. హైస్కూల్స్‌లో స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థుల కు రూ.వెయ్యిల చొప్పున నగదు, మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు.

- కొయ్యలగూడెం : మానవత సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం స్థానిక కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. అధ్యక్షుడిగా మాటూరు సుధీర్, ప్రధాన కార్యదర్శిగా కంబంపాటి సాయికృష్ణ, కోశాధికారిగా మోతమర్రి ఉమా, ఉపాధ్యాక్షుడుగా మందపాటి రామకృష్ణ, బీసీ హెల్త్‌గా తిగిరిపల్లి చంటి, సహాయ కార్యదర్శిగా వంకదారి సర్వేశ్వరరావు, బీసీ ఎడ్యూకేషన్‌గా శేఖర్, మట్టే శ్రీనివాసరావు, యర్రా ఉమామహేశ్వరరావు, ప్రమాణస్వీకారం చేశారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కారటం సాయి, సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, కూటమి నాయకులు ఉన్నారు.
- జంగారెడ్డిగూడెం : గురవాయిగూడెంలోని మానవత కమ్యూనిటీ హాలు నందు ఆ సంస్థ మండల చైర్మన్ ఆకుల ధర్మరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మానవత మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా అయినాల వెంకట రమణ మూర్తి, కార్యదర్శిగా మహంకాళి రంగప్రసాద్, కోశాధికారిగా ఇమ్మంది మాధవరావు, ఉపాధ్యక్షుడిగా అల్లూరు రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా పల్లి వెంకటరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా దల్లి రామాంజనేయ రెడ్డి,పెనుమర్తి సురేష్, మొగళ్లపు శ్యామ్ ,భరద్వాజ రామకృష్ణ ఎన్నికయ్యారు. పేద విద్యార్థులకు రూ.8,900 సాయం అందజేశారు. జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, కృష్ణమూర్తి ,గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.
- పెదపాడు : మండల మానవత నూతన కార్యవర్గం ఎన్నిక పెదపాడులో ఆదివారం జరిగింది. మానవత మండల అధ్యక్షుడిగా ఆలపాటి హనుమంతరావు, కార్యదర్శిగా గుండపనేని సురేష్, కోశాధికారిగా జుజ్జువరపు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా దావాల వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా చేవూరి వెంకట్రావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఆరోగ్యం వేల్పుల ప్రభాకర్, ఉప్పల రాజా రమేష్, ఆగోళ్ళ శేఖర్, గారపాటి రాజా రామమోహనరావు ఎన్నికయ్యారు.

వర్గీకరణ కోసం మరోసారి పోరాటం తప్పదు


వేగివాడలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు


టి.నరసాపురంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళి


జంగారెడ్డిగూడెంలో రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఏలూర టూ టౌన్, జూలై 7: ఎస్సీ సామాజిక వర్గంలో ఉపకులాలన్నింటికి న్యాయం జరగాలంటే ఎస్సీ వర్గీకరణ తప్పదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ అన్నారు. మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కంద్రికగూడెంలో సమావేశం జరిగింది. రమేష్ మాట్లాడుతూ వర్గీకరణ కోసం మరో పోరాటానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. అనంతరం కేకుకట్ చేశారు. కాశీకృష్ణ, బయ్యారపు రాజేశ్వరరావు, పాల్‌రాజ్, నాగేంద్రబాబు, సాయిబాబా, మున్నుల జాన్‌గురునాధ్, తదితరులు పాల్గొన్నారు.

- టినరసాపురం : కె.జగ్గవరంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు కేక్ కట్ చేసి స్వీట్లు పంచి, ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు.బర్రె సత్యనారాయణ, కొమ్ము గంగాధర్, సొదిమళ్ళ బాబురావు, ఉప్పులూరి సుబ్బారావు, బొడ్డపాటి వెంకన్నబాబు, గుడిదల మహేష్, బొడ్డపాటి నవీన్, బొడ్డపాటి సాయిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.
- పెదవేగి : ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినం, వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ జన్మదిన కార్యక్రమం వేగివాడలో ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి మురళీ మాదిగ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. నాయకులు జొన్నకూటి జాన్ మాదిగ, యర్రా ఆనంద్, తాడిగడప రాంబాబు, లక్షపాము శ్రీను పాల్గొన్నారు.
- జంగారెడ్డిగూడెం : మాదిగల సమస్యలను రాష్ట్ర కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తామని ఎమ్మార్పీఎస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గొల్లమందల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో ఎమ్మార్పీఎస్ సమావేశం పట్టణ అధ్యక్షుడు మద్దిపాటి ఇస్సాకు అధ్యక్షతన జరిగింది. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు లాగు ప్రకాష్, రాష్ట్ర యువజన సంఘ ప్రధాన కార్యదర్శి కడిమి రాజేష్, కొత్తపల్లి వీరవెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


భీమడోలులో మాట్లాడుతున్న గన్ని

భీమడోలు, జూలై 7 : ఏలూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులని భీమడోలు మండలం ఆగడాలలంక గ్రామస్తులు కొంతమంది కలిసి గ్రామ సమస్యలు విన్నవించారు. టీడీపీ హయాంలో మొదలు పెట్టి పూర్తికాని బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చేయాలని, అలాగే మహిళా సమాఖ్య భవనం నిర్మాణం, మంచినీటి చెరువు మరమ్మతు, పలు రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆగడాల లంక గ్రామంలో రూ.10 కోట్లతో టీడీపీ హయాంలో ప్రతిపాదించిన రోడ్డు గ్రాంటును వైసీపీ ప్రభుత్వం ఉపయోగించుకోలేదని, అలాగే తాగునీటి కోసం రూపకల్పన చేసిన ప్రాజెక్టును అమలు చేయలేదని, ఈ సమస్యలన్నింటి మీద ఏలూరు ఎంపీ మహేష్, ఎమ్మెల్యే ధర్మరాజుతో చర్చించి పరిష్కరిస్తామన్నారు.

నేడు మూడు నూతన ఆర్టీసీ సర్వీసులు ప్రారంభం

జంగారెడ్డిగూడెం, జూలై 7 : జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోకు చెందిన మూడు నూతన బస్సులను చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సోమవారం ప్రారంభిస్తారని పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ తెలిపారు. వీటిలో స్టార్‌లైన్ బస్సులు రెండు హైదరాబాదు బీహెచ్‌ఈఎల్ సర్వీసులని, మరో బస్సు(హై టెక్) విజయనగరం సర్వీసని ఆర్టీసీ డీఎం గంగాధరరావు తెలిపారు

కౌలు రైతు అర్హత పత్రం తప్పనిసరి

జంగారెడ్డిగూడెం, జూలై 7 : మండలంలోని కౌలు రైతులందరూ ఆయా రైతు సేవా కేంద్రాల (రైతు భరోసా కేంద్రాలు)వద్ద కౌలు రైతు అర్హత పత్రం కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ పోశారావు ఆదివారం సూచించారు. ప్రభుత్వ పథకాలు పొందాలన్నా, పంట నష్టపరిహారం అందుకోవాలన్నా కౌలు రైతు అర్హత పత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. అందు కోసం రైతు సేవా కేంద్రాల వద్ద దరఖాస్తు చేస్తే రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పరిశీలించి రైతు అర్హత పత్రం మంజూరు చేస్తామని తెలిపారు.

లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

చింతలపూడి, జూలై 7: పట్టణ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం చింతలపూడిలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉక్కుర్తి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఆచంట వెంకట రమణ, కార్యదర్శిగా వంగల నాగప్రసాదరెడ్డి, కోశాధికారిగా ఉయ్యూరి చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడిగా యామిజాల మూర్తి, చౌదరి, కమిటీ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో లారీ నిలిపేందుకు స్థలం లేనందున స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు సభ్యులు తెలిపారు.

24న ఏఐటీయూసీ శిక్షణ తరగతులు

ఏలూర టూ టౌన్, జూలై 7 : ఈ నెల 24, 25, 26 తేదీల్లో మదనపల్లిలో జరగనున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విగ్నేష్, భజంత్రి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

175 మందికి వైద్య సేవలు


వైద్య శిబిరంలో పాల్గొన్న 'నాట్స్' ప్రతినిధులు, వైద్యులు

ఏలూరు అర్బన్, జూలై 7 : అధిక బరువు, అపరిమిత ఆహారం, వ్యాయామం చేయకపోవడం వంటివన్నీ మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులకు దారి తీస్తాయని ఏలూరు ఆయుష్ హాస్పటల్స్ వైద్య నిపుణులు ఎంఎల్‌వీ సాయికృష్ణ, కోగంటి రమ్య, భానుకిరణ్ తెలిపారు. నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్), ఆయుష్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం వట్లూరు జడ్పీ హైస్కూలు ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో షుగర్, బీపీ వైద్య పరీక్షలతో పాటు, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి మాట్లాడుతూ మొత్తం 175 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశామన్నారు. మెనోపాజ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం కింద 40 ఏళ్లు పైబడిన మహిళలకు థైరాయిడ్ పరీక్షలు చేశామన్నారు. 'నాట్స్' చైర్మన్ పిన్నమనేని ప్రశాంత్, ప్రెసిడెంట్ పాములపాటి మదన్, కొమ్మన లక్ష్మణ్, ధూళిపాళ్ల భానుప్రకాష్, ఏలూరు హేలాపురి రూరల్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు సహకరించారని వివరించారు.

సెంట్రల్ లైటింగ్‌కు సోలార్



ఉంగుటూరు, జూలై 7 :జాతీయ రహదారుల విభాగం ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలంలోని సెంట్రల్ లైటింగ్ విద్యుదీకరణలో భాగంగా చేబ్రోలులో డివైడర్ వద్ద సోలార్ పలకలు అమర్చారు. దీని ద్వారా విద్యుత్ ఆదా అవుతుందని హైవే సిబ్బంది తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ

కొయ్యలగూడెం, జూలై 7: అగ్నిప్రమాద బాధితులకు ఇంటిస్థలం, ఇళ్ళు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ కూనపం రాజారత్నం కోరారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని అంకాలగూడెం గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇళ్ళు కోల్పోయిన సొంగా శేఖర్‌బాబు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరఫున అన్ని విధాల సహాయం అందించామని అదే విధంగా ప్రభుత్వం కూడా ఈ కుటుంబానికి ఇంటి స్థలాన్ని ఇళ్ళను మంజూరు చేయాలని కోరారు.

ఉద్యోగ విరమణ సత్కారం

కొయ్యలగూడెం, జూలై 7: జంగారెడ్డిగూడెం జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన వెంకటరమణ మాస్టారును బయ్యన్నగూడెంలో పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు లింగిశెట్టి శ్రీను, షేక్ బాజీ, గంగరాజు, గుమ్మా రామకృష్ణ, పల్లి గంగరాజు, శ్రీను, పార్థసారధి, ధనకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రంగారావు


నూతన సభ్యులను అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

ఏలూరు రూరల్, జూలై 7: ఏలూరు విజన్ లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. అధ్యక్షుడిగా జరజాపు రంగారావు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రముఖ నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ పి.విజ య్‌భాస్కర్ రెడ్డి, జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, రీజనల్ చైర్‌పర్సన్ వి.రత్నకుమార్, జడ్‌సీ ఎ.రాఘవరావు, సీనియర్ నాయకులు రమణమూర్తి, అవినాష్‌రాజు, క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు. మొదటి ఉపాధ్యక్షులుగా జి.మోజేష్, రెండో ఉపాధ్యక్షుడిగా బీవీ రమణమూర్తి, కార్యదర్శిగా ఆర్‌వీ అనిల్‌కుమార్, ట్రెజరర్‌గా ఎస్.బాబి, కోఆర్డినేటర్‌గా సిహెచ్ పావని, అడ్మినిస్ట్రేటర్‌గా శేషుకుమార్, పలువురు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు.

అవయవ దానంతో మరో జీవితం



సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి

ఏలూరు రూరల్, జూలై 7: చనిపోయాక కూడా ఇతరుల జీవితాల్లో వెలుగు నింపి, మరోసారి జీవించే అవకాశం అవయవ దానం కల్పిస్తోందని, సావిత్రిబాయ్ పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, అఖిలభారత అవయవ దాతల సంఘం అధ్యక్షురాలు గూడూరి సీతామహాలక్ష్మి అన్నా రు. ఆదివారం పత్తేబాదలోని శ్రీసాయిరాధా మినీ ఫంక్షన్‌హాల్లో మాతృదేవోభవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శరీర, అవయవ దానంపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శరీరదానం చేయాలంటే ఏ విధంగా దరఖాస్తు చేయాలో వివరించారు. బ్రెయిన్‌డెడ్ అయిన వారి అవయవ దానంతో 18 మంది జీవితాలను మార్చవచ్చని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి పునర్జన్మ ఇవ్వడం కంటే జన్మసార్థకత ఏముంటుందన్నారు. వేమా హరినారాయణ, పి.ఫణీంద్రనాథ్ పాల్గొన్నారు.



సూరేపల్లి ఎంపీపీ పాఠశాలలో చేరిన వర్షపునీరు

వానొస్తే చెరువే

సూరేపల్లి పాఠశాలలో కదలని వాననీరు

ముసునూరు, జూలై 7: సూరేపల్లి ఎంపీపీ పాఠశాలను వర్షపునీరు ముంచెత్తుతోంది. ఒక మోస్తరు వర్షానికే పాఠశాల ఆవరణలోకి నీరు చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఏడేళ్ళుగా వర్షాకాలంలో ఇదే పరిస్థితి కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు మెరకగా ఉండి పాఠశాల పల్లం కావడంతో వర్షపునీరు బయటకు పోయే దారి లేక చిన్నపాటి వర్షం వచ్చినా పాఠశాల ఆవరణలో నీరు చేరి చెరువును తలపిస్తోంది. భారీ వర్షం పడితే తరగతి గదుల్లోకి చేరి పిల్లలు కూర్చునే పరిస్థితి కూడా లేదని, రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమల ఉధృతి పెరిగి విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపునీరు బయ టకు పోయేలా రహదారి మధ్య నుంచి సిమెంట్ తూరలు వేసి సమస్య పరిష్కరించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా నేటికీ పట్టించుకున్న నాథుడే లేడని తల్లిదండ్రులు మండిపడుతు న్నారు. ఇప్పటికైనా పాఠశాలను వర్షపునీటి ముంపు నుంచి కాపాడేలా జిల్లా ఉన్న తాధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

ఈ హాస్టల్‌లో.. ఉండేదెలా?

- శిథిలావస్థకు చేరిన బాలికల వసతి గృహం
- స్లాబు నుంచి లీకవుతున్న వర్షం
- బీటలు వారిన పిల్లర్లు
- చేరేందుకు విద్యార్థినుల ఇబ్బందులు







ముదినేపల్లిలో పాడుబడిన భవనంలా ప్రభుత్వ ఎస్సీ కళాశాల బాలికల వసతిగృహ భవనం (ఇన్‌సెట్) వసతిగృహం వరండా పిల్లర్లకు బీటలు.. పెచ్చులూడిన స్లాబు

ముదినేపల్లి, జూలై 7 : చిన్నపాటి మరమ్మతులను అధికారులు నిర్లక్ష్యం చేసిన ఫలితంగా చివరికి లక్షలాది రూపాయల విలువైన ప్రభుత్వ వసతి గృహ భవనాలను మూసేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గదుల్లో స్లాబు పాడైపోతున్నా, స్లాబు నుంచి వర్షం నీరు కారుతున్నా అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్టు వ్యవహరించి భవనాల్లో విద్యార్థులు ఉండలేని పరిస్థితిని తీసుకొచ్చారు. ముదినేపల్లిలోని అంబేడ్కర్ కాలనీలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతిగృహం భవనం పరిస్థితి అధ్వానంగా తయారయింది. ఈ వసతి గృహ భవనం శిథిలమై ఆందోళన కలిగిస్తున్నది. సిమెంట్ పిల్లర్లు బీటలు వారి ఎప్పుడు కూలిపోతాయో అన్నట్టు ఉంది. స్లాబు అడుగు భాగం నుంచి సిమెంట్ పెళ్లలు విరిగి పడుతుండటంతో కొన్ని గదులను ఏనాడో మూసేశారు. పదేళ్లుగా ఈ వసతిగృహ భవనం శిథిలమవుతుంటే మరమ్మతులు కూడా చేయించకుండా వదిలేయటంతో ఇప్పుడు వసతి గృహంలోకి అడుగు పెట్టేందుకే భయమేస్తోంది. విద్యార్థులు ఉండేందుకు ప్రమాదకరంగా ఉండటంతో ఇప్పుడు ఆ భవనాన్ని మూసేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఈ వసతి గృహంలో వంద మందికి పైగా విద్యార్థినులు ఉండగా, భవనం దుస్థితి వల్ల ఆ సంఖ్య గత రెండేళ్లుగా 30కి పడిపోయింది. కౌన్సెలింగ్ పూర్తయి విద్యార్థినులు వస్తే ఈ భవనంలో వసతి ఎలాగన్నది ప్రశ్నార్థకం.

నూతన భవనానికి ప్రతిపాదనలు

ఈ వసతిగృహ భవనం పాడైపోవటంతో పీఎం అజయ్ పథకం కింద రూ.3 కోట్లు వ్యయంతో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పంపారు.

-అనిత, హెచ్‌డబ్ల్యూఓ, ముదినేపల్లి



బురదకయ్యగా మారిన కలిదిండి పీహెచ్‌సీ ఆవరణ

రోగులకు పరీక్షే

- బురదమయంగా పీహెచ్‌సీ ఆవరణ
- జారిపడుతున్న రోగులు
- ప్రహరీలేక పశువులు, వరాహాల సంచారం

కలిదిండి, జూలై 7 : కలిదిండి పీహెచ్‌సీ ఆవరణ బురదకయ్యగా మారి అపరిశుభ్రత తాండవిస్తోంది. వర్షాలు కురుస్తుండటంతో చుట్టుపక్కల వర్షపు నీరు ఆవరణలోకి చేరుతోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో బురద నీటిలో నడుచుకుంటూ వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారు. కొంతమంది కాలు జారి పడి పోతున్నారు. పశువులు, వరాహాలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రతి రోజు 200 నుంచి 300 మంది రోగులు ఆసుపత్రికి వస్తారు. 24 గంటల ఆసుపత్రి కావటంతో రోగుల సంఖ్య అధికంగా ఉంటుంది. ఆసుపత్రి భవనం చుట్టూ ప్రహరీ లేకపోవటంతో పశువులు, వరాహాలకు నిలయంగా మారింది. చుట్టుపక్కల వారు ఇక్కడే చెత్తాచెదారం వేయడంతో అపరిశుభ్రంగా ఉంటోంది. ప్రహరీ నిర్మించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఐదేళ్లుగా విన్నవించినా పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీ ఆవరణలో చెత్తాచెదారం, గుంతల్లో నీరు తొలగించి పీహెచ్‌సీ భవనం చుట్టూ ప్రహరీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆగిరిపల్లిలో బ్యానర్ రగడ



చించివేసిన టీడీపీ బ్యానర్

ఆగిరిపల్లి, జూలై 7: ఆగిరిపల్లిలో ఆదివారం రాత్రి టీడీపీ బ్యానర్లను వైసీపీ నాయకులు చించివేయటంతో గొడవ రాజుకుంది. స్థానిక పొగడ చెట్ల మండపం వద్ద ఉన్న టీడీపీ బ్యానర్‌ని వైసీపీ పట్టణ అధ్యక్షుడు చిమట శ్రీను, ఎంపీపీ సాదం గోపి చించివేస్తుండగా అటుగావెళుతున్న టీడీపీ కార్యకర్తలు కాజా కిషోర్, రాణిమేకల మల్లేశ్వరరావు ప్రశ్నించటంతో వైసీపీ నాయకులు వీరిని కొట్టి గాయపర్చారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవటంతో వైసీపీ నాయకులు పారిపోయారు. నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారధి ఉన్న బ్యానర్‌ను చించి ఆయన్ని అవమాన పర్చినవారు బ్యానర్ వద్దకు వచ్చి క్షమాపణ చెప్పాలని టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా టీడీపీ శ్రేణులు భీష్మించుకొని కూర్చున్నారు. అర్ధరాత్రి దాటినా గొడవ సద్దుమణగలేదు.



అస్వస్థతకు గురైన విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత

చాట్రాయి, జూలై 7: మండలంలోని చనుబండ ఉషోదయ స్కూల్ హాస్టల్‌లో చదువుతున్న నలుగురు విద్యార్థులు ఆదివారం రాత్రి అస్వస్థతకు గురికావటంతో హుటాహుటిన అధికారులు వచ్చి విచారణ జరిపారు. ఈ హాస్టల్‌లో 42 మంది విద్యార్థులు ఉండగా, ఆదివారం బిర్యానీ తిన్న తరువాత 4 గురు విద్యార్థులకు కడుపునొప్పి రావటంతో స్కూల్ యాజమాన్యం అప్రమత్తమై ఒకరికి చనుబండలో, ముగ్గురికి సత్తుపల్లిలో చికిత్స చేయించటంతో కోలుకున్నారు. విషయం తెలియగానే పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి, ఎంఈవో వీయస్వీ బ్రహ్మచారి, ఎస్సై కేసీహెచ్ స్వామి హాస్టల్‌కు వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు గ్యాస్టిక్ సమస్య ఉండటం వలన ఇలా జరిగి ఉండవచ్చునని, తిన్న ఆహారం కలుషిత కాలేదని అధికారులు చెప్పారు. విషయం తెలియగానే తల్లిదండ్రులు హాస్టల్‌కు చేరుకున్నారు. విద్యార్థులు క్షేమంగా ఉండటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. దీనిపై స్కూల్ ప్రిన్సిపాల్ వెంకట్రామయ్యను వివరణ కోరగా 42 మంది విద్యార్థులకు గాను కేవలం నలుగురు మాత్రమే అస్వస్థతకు గురయ్యారని, వారు గ్యాస్ట్రిక్ ట్రబుల్‌తో బాధపడుతున్నారని, డాక్టర్లు కూడా అదే చెప్పారని తెలిపారు.

పెద్దింటమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యేలు



ఎమ్మెల్యే ధర్మరాజుకు సత్కారం

కైకలూరు, జూలై 7: కొల్లేటికోట పెద్దింటమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆదివారం కావడంతో వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో కేవీ గోపాలరావు ఎమ్మెల్యేలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలు చేయించారు. అనంతరం వారిని అమ్మవారి శేష వస్త్రాలతో సత్కరించారు.





లక్ష్మీపురం ఆలయం నుంచి బయలుదేరిన జగన్నాథ రథం.. వడాలిలో జగన్నాథస్వామి రథయాత్ర

కదిలిన జగన్నాథ రథచక్రాలు

ద్వారకాతిరుమల, జూలై 7: శ్రీజగన్నాథుని దివ్య రథచక్రాలు లక్ష్మీపురం ఆలయం నుంచి శ్రీవారి క్షేత్రం వైపునకు కదిలాయి. శోభాయమానంగా ఆదివారం సాయంత్రం జరిగిన రథయాత్రను వీక్షించిన భక్తజనులు పరవశించారు. అతిపురాతనమైన ఈ ఆలయం శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమై విరాజిల్లుతోంది. ఈ క్రమంలో జగన్నాథుని రథోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమై ఈనెల 16 వరకు జరుగనున్నాయి. ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని పుష్పమాలికలు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపతోరణాలతో సుందరీకరించారు.

లక్ష్మీపురం ఆలయంలో రథోత్సవాలు ప్రారంభం

రథయాత్ర ఇలా..

అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ పూరి క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, సమేత జగన్నాథుని దారు విగ్రహాలను అట్టహాసంగా కోవెల నుంచి తెచ్చి రథంలో ఏర్పాటుచేసిన సింహాసనంపై ఉంచి అలంకరించారు. ఆలయ అధికారుల పూజల అనంతరం బలిహరణను సమర్పించి రథయాత్రను ప్రారంభించారు. మేళతాళాలు, సన్నాయి డప్పువాయిద్యాలు, పండితుల వేదమంత్రోచ్ఛరణలు, కోలాట భజనల నడుమ జగన్నాథ రథయాత్ర ద్వారకాతిరుమల క్షేత్రానికి చేరుకుంది. భక్తులు హారతులు పట్టారు. క్షేత్రంలో తిరుగాడిన అనంతరం రథం తిరిగి లక్ష్మీపురం ఆలయానికి చేరుకుంది.



మత్స్యావతారంలో జగన్నాథుడు

మత్స్యావతారంలో జగన్నాథుడు ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీపురం ఆలయంలో ఆదివారం ఘనంగా ప్రారంభమైన జగన్నాథుని రథోత్సవాలను పురస్కరించుకుని స్వామివారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. దీనిలో భాగంగా తొలిరోజున మత్స్యావతారంలో శంఖు, చక్రాలను ధరించి, గదధారియై భక్తజనులకు అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్టు అలంకరణ చూపరులకు కనువిందు చేసింది.





కైకలూరు రథయాత్రలో భక్తులు ఊరేగుతున్న సుభద్ర, బలరామ సమేత జగన్నాథుడు

వైభవంగా కైకలూరు, వడాలిలో రథయాత్రలు

కైకలూరు/ముదినేపల్లి, జూలై 7: కైకలూరు ఇస్కాన్ రాధాకృష్ణ మందిరం ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహించారు. కైకలూరు శ్యామలాంబ అమ్మవారి ఆలయం నుంచి రథయాత్రను భక్తుల కోలాహలం మధ్య ప్రారంభించారు. భక్తులు రథాన్ని లాగుతూ హరేకృష్ణ సంకీర్తన చేశారు. అనంతరం జరిగిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. రథయాత్ర అనంతరం శ్యామలాంబ అమ్మవారి ఆలయ కళా మండపంలో స్వామి వారికి 56 రకాల ప్రసాదాన్ని (చప్పన్ భోగ) నివేదించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో ఉన్న సుభద్ర, బలరామ సహిత జగన్నాథస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. వడాలి దేవస్థానం వద్ద ప్రారంభమైన జగన్నాథుడి రథయాత్ర ముదినేపల్లి, పెయ్యేరు కాలనీ, శ్రీహరిపురం, సింగరాయపాలెం బావాజీ మఠం వద్దకు సుమారు పది కిలోమీటర్లు కొనసాగింది. దారి పొడవునా భక్తులు రథాన్ని లాగి స్వామికి పూజలు నిర్వహించారు.

పేద విద్యార్థులకు చేయూత



ముదినేపల్లి, జూలై 7 : ముదినేపల్లి మండలం పెయ్యేరు గ్రామ ప్రముఖులు దుక్కిపాటి దేవికా రాణి జ్ఞాపకార్థం ఆమె భర్త రాజేంద్ర ప్రసాద్ పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆదివారం పెయ్యేరులో ఇద్దరు విద్యార్థులకు రూ.50 వేలు, వారి తల్లిదండ్రులకు అందజేశారు. 1200 మంది వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రతి ఏటా 14 మంది పేద విద్యార్థులకు రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. రాజేంద్ర ప్రసాద్ కుమారుడు, యూఎస్‌లో స్థిరపడిన డాక్టర్ రామనాథబాబు, అంబిక దంపతులు ఈ కార్యక్రమంలో పేద విద్యార్థులకు సహాయం అందజేశారు. మాజీ సర్పంచ్ దుక్కిపాటి శేషుబాబు, పాల సొసైటీ అధ్యక్షుడు హనుమార పేర్నీడు, జాస్తి బాబూ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మాంసం విక్రయాలు

ముసునూరు, జూలై 7: ముసునూరులో డెంగీ కేసు నమోదుకావడంతో మాంసం విక్రయాలను నెలరోజుల పాటు నిలిపివేయాలని అధికారులు జారీచేసిన ఆదేశాలు బేఖాతరయ్యాయి. మాంసం వ్యాపారులు ఆదివారం మాంసం విక్రయాలను కొనసాగించటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డెంగీ నివారణలో భాగంగా ఈవోపీఆర్‌డీ ఎస్.వి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే మాంసం విక్రయాలపై ఆంక్షలు విధించారు. అయినప్పటికీ ఆదివారం యథావిధిగా మాంసం విక్రయాలు జరిగాయి. మాంసం విక్రయదారులు లైసెన్సులు లేకుండా వ్యాపారాలు చేస్తున్నారని, గ్రామం మధ్యలో ఈ విక్రయాలు సాగటం వల్ల చుట్టుపక్కల నివాసాల వారికి అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, వీరిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

డాక్యుమెంట్ రైటర్ల సమస్యలు పరిష్కరించాలి

నూజివీడు టౌన్, జూలై 7: డాక్యుమెంట్ రైటర్లకు లైసెన్సులు జారీచేసి వారి ఉపాధికి భరోసా కల్పించాలని, రాష్ట్ర వృత్తిపరిరక్షణ సమితి అధ్యక్షుడు జి.వేణుగోపాల్ అన్నారు. నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్ల అసోసియేషన్‌తో కలసి విలేకరులతో మాట్లాడుతూ తరతరాలుగా డాక్యుమెంట్ రైటర్లుగా జీవనోపాధి పొందుతున్న వారికి గత రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం వల్ల జీవనోపాధి కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి భూములు, ఆస్తులను కొనుగోలు చేసిన వారికి ఫిజికల్ డాక్యుమెంట్లు విడుదల చేయాలని, డాక్యుమెంట్ రైటర్ల వృత్తిపరిరక్షణకు లైసెన్సులు మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. డాక్యుమెంట్ రైటర్ల అసోసియేషన్ నాయకులు ఆంజనేయులు, మహేష్, అబ్బాస్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వాసవి మాతకు ఆషాఢ సారె

ముదినేపల్లి, జులై 7 : ముదినేపల్లిలోని శ్రీ సువర్చలా సమేత భక్తాంజనేయ స్వామి ఆలయంలో వేంచేసి ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆదివారం ఆర్యవైశ్య మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. స్థానిక పెదరామాలయంలో స్వామివారికి పూజలు జరిపిన అనంతరం ఆర్యవైశ్య సంఘ నాయకులు మాడుగుల పూర్ణ, వత్తుమిల్లి ప్రసాద్, కొల్లిపర లక్ష్మీకుమారి, మురహరి ప్రసన్న తదితరుల ఆధ్వర్యంలో మహిళలు పసుపు, కుంకుమ, చీరె, జాకెట్టు ముక్కలు, మిఠాయిలతో ఆషాఢ సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం కుంకుమ పూజలు జరిపారు. వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారిని అలంకరించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

ముదినేపల్లి, జులై 7 : సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు పుట్టలో పాలుపోసి పొంగళ్లు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. అభిషేకాలు చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సంధ్య పర్యవేక్షణలో అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ పూజలు నిర్వహించారు.

సమసమాజ స్థాపనే కమ్యూనిస్టుల లక్ష్యం కావాలి

నూజివీడు, జూలై 7: సమసమాజ స్థాపనకు కృషి చేసేవారే నిజమైన కమ్యూనిస్టులుగా ముందుకెళ్లగలుగుతారని, ఆర్థిక శాస్త్ర విశ్లేషకుడు పాపారావు అన్నారు. నూజివీడు అమర్ భవన్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మేధోమథన సదస్సు ఆదివారంతో ముగిసింది. సదస్సులో ఆయన మాట్లాడుతూ ఉన్నది ఉన్నట్లుగా ప్రజలకు వాస్తవాలు వెల్లడించటం, కమ్యూనిస్టుల పని అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు, డీవీవీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ చొరవతో డ్రైనేజీ సమస్య పరిష్కారం

ముసునూరు, జూలై 7: ముసునూరు ఆంజనేయస్వామి గుడి వద్ద దీర్ఘకాల డ్రైనేజీ సమస్యను సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా పరిష్కరించారు. గత పాలకులు డ్రైనేజీలో కనీసం సిమెంట్ తూరలు వేయకుండా సీసీ రోడ్డు నిర్మించడంతో వర్షపు నీరు, వాడుక నీరు సైతం రహదారిపైనే ప్రవహించి అపరి శుభ్రత నెలకొనడంతో స్థానికులు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లగా పంచాయతీలో నిధులు లేకపోయినా సర్పంచ్ రూ.55 వేలతో డ్రైనేజీకి ఇరువైపులా బీమ్‌లు వేసి దానిపై స్లాబ్ వేశారు. దీంతో దీర్ఘకాల డ్రైనేజీ సమస్య పరిష్కారమైంది. ఈ స్లాబ్‌ను ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్, బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నక్కా యోహా ను ఆదివారం పరిశీలించారు. సర్పంచ్ చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రజకుల కమ్యూనిటీ హాల్ విస్తరణకు శంకుస్థాపన

ఆగిరిపల్లి, జూలై 7: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆగిరిపల్లి రజకుల కమ్యూనిటీ హాలు విస్తరణకు మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. హామీ మేరకు మంత్రి తన సొంత నిధులతో నిర్మిస్తున్న భవనానికి టీడీపీ నాయకుడు, విజయవాడ కనక దుర్గమ్మ ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్ ఆదివారం శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.



లోపూడిలో కేక్‌ను కట్ చేసి ఎమ్మార్పీఎస్ నాయకుల నినాదాలు



సి. గుడిపాడులో నినాదాలు



ఆగిరిపల్లి, నూజివీడుల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు



ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ముసునూరు, జూలై 7: వర్గీకరణ మాదిగల చిరకాల స్వప్నమని దానిని నెరవేర్చటానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగలంతా ఐక్యంగా పోరాడాలని, నియోజకవర్గ సమితి అధ్యక్షుడు దుబ్బాకు దేవరాజు మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా లోపూడి, ముసునూరు గ్రామాల్లో ఆయన పతాకాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోపూడి జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద, ముసునూరులో ఎస్సీ కాలనీ ప్రధాన కూడలిలో కేక్‌ను కట్ చేసి మిఠాయిలను పంచారు. ఈ సందర్భంగా దేవరాజు మాదిగ మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి మాదిగ గ్రామంలో ఎమ్మార్పీఎస్ కమిటీలు ఏర్పాటు చేసి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సహకారంతో మాదిగ రిజర్వేషన్ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. అనంతరం ఈ రెండు గ్రామాల్లో నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ, ఎమ్మార్పీఎస్ నాయకుడు డాక్టర్ ప్రతాప్, నాయకులు పాల్గొన్నారు.

చాట్రాయి: సి. గుడిపాడు దళితవాడలో ఆదివారం ఎమ్మార్పీయస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమితి నాయకుడు విస్సంపల్లి జాన్సేసు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలమైన ఎన్డీఏ ప్రభుత్వాలు కేంద్రంలోను, రాష్ట్రంలోను కొలువుదీరినందున త్వరలోనే వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి బస్టాండ్ సెంటర్లో ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి నాయకుడు కంబాల ప్రదీప్ మాట్లాడుతూ రాబోయే కాలంలో మాదిగలందరికీ వర్గీకరణ ఫలాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మల్లంపల్లి రవిశేఖర్, తాళ్సూరి అదాము, కలపాల సురేష్, నల్లమోతు కాంచనరావు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు మండలం వెంకటా యపాలెంలో ఎమ్మార్పీఎస్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమితి నాయకులు తిరుపతిరావు ఆధ్వ ర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ చేస్తున్న ఉద్యమాలను గుర్తుకు తెచ్చుకున్నారు. సమితి గ్రామ నాయకులు పాల్గొన్నారు.